ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర


తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY



అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
జాత్రి వారికి మీడియా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674



మంగళవారం 16 జూన్ 2026 | Tuesday 16 June 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 75 | Vol.No 28 Issue No .75 | Hyderabad | www.visionandhra.in


## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

- కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి
- అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి
- గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం
- క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు
- ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సీఎం రేవంత్ సమీక్ష






హైదరాబాద్,జూన్15 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష

మిగతా 2లో..

## మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డి

- హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి,
- కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం,
- ఎన్ఓసి ఇప్పించడంలో కూడా విఫలం,
- ఎల్ అండ్ టికి రుణ బదలాయంపును అడ్డుకున్న పెద్దమనిషి,
- అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి,
- మోడీ హామీల అమలుపై చెప్పండి... నేను రాజీనామాకు సిద్ధం,
- మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు

## ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు




వాషింగ్టన్,జూన్15 : పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం

మిగతా 2లో..

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

### స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన



న్యూఢిల్లీ,జూన్15 : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు

మిగతా 2లో..

## శ్రీశైలంలో కిషన్ రెడ్డి దంపతులు



మిగతా 2లో..



## తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

హైదరాబాద్,జూన్ 15 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని

మిగతా 2లో..

## తెలంగాణలో మోగిన బడిగంటలు

- రాష్ట్రవ్యాప్తంగా తెరుసుకున్న స్కూళ్లు
- మళ్లీ రోడ్డెక్కిన బస్సులు, ఆటోలు
- కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



హైదరాబాద్,జూన్15 : వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ

మిగతా 2లో..

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్,
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు,
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు,
- కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు



హైదరాబాద్,జూన్15 :రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని

మిగతా 2లో..

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

- ఓపెన్ కాస్ట్‌లత విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత



మంచిర్యాల,జూన్15 : సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా

మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

- బిజెపి కుట్రలో పావుగా మారిన పవన్
- ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ హెచ్చరిక



హైదరాబాద్,జూన్15 : పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్

మిగతా 2లో..

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న,మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి



హైదరాబాద్,జూన్15 :తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం

మిగతా 2లో..

### దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యాంగా

## జనసేన ఆవిర్భావం

- 12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు.. విజయాలు.. పరాజయాలు
- ఆచరణాత్మక విధానాలతో పయనం వల్లే పార్టీ నిలబడింది
- 21 ఎమ్మెల్యేలను, 3 ఎంపి స్థానాలను గెల్చుకోగలిగాం
- తెలంగాణ ఏర్పాటును కాదు.. విభజన తీరునే వ్యతిరేకించాం
- మార్పు కోసం ఎవరైనా ప్రయత్నించ వచ్చు
- అందుకు కాక్రోచ్ జనతా పార్టీయే ఉదాహరణ
- జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్



న్యూఢిల్లీ,జూన్15 : జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట దిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ..

మిగతా 2లో..

## సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చంద్రబాబు భేటీ

- టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఎఐపై చర్చ
- దాదాపు 30 నిముషాల పాటు ప్రధానితో బాబు భేటీ



అమరావతి,జూన్15 :ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక రంగ సహకారం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కీలక అంశాలపైసిఎం చంద్రబాబు చర్చించారు. ఏపీ అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ, సెమీకండక్టర్లు,

మిగతా 2లో..

## ఎపిలో పెట్టుబడులు పెట్టండి

- ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం
- లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు
- హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ
- ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్
- ఎపిని సందర్శించండి.. పెట్టుబడులు పెట్టండి
- సింగపూర్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ



అమరావతి,జూన్15 : ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా

మిగతా 2లో..

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెల్లుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవతల పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్దిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ది రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం

**- పరకాలలో ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు**

**- నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద చర్యలు తప్పవు : అధికారులు**



పరకాల, జూన్ 15 విజన్ ఆంధ్ర : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు పరకాల పట్టణంలో సోమవారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరకాల సీఐ క్రాంతి కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిరెడ్డి, ఏవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలో ఉన్న దాదాపు 15 ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను అధికారులు సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, రైతుల కష్టార్జిత సంపాదనను దోచుకునే నకిలీ వ్యాపారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. పరకాల పరిసర ప్రాంతాల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు. రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని వ్యవసాయ రంగంలో పారదర్శకతను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ ముఠా బట్టబయలు,ఇద్దరు అరెస్టు






ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జూన్15,(విజన్ ఆంధ్ర): నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసి రద్దీ ప్రాంతాలు,సంతలు, వృద్ధులున్న దుకాణాల్లో చలామణి చేస్తున్న ముఠాను చండూర్ పోలీసులు అరెస్టు చేశారు. చండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఇద్దరు నిందితులను పట్టుకుని నకిలీ నోట్లు,ప్రింటర్,స్కానర్, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి తెలిపారు.చండూర్ మండలం తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఆవుల కిరణ్ జూన్12న చండూర్ టౌన్‌లోని శ్రీ మాధురి మిల్క్ సెంటర్ వద్ద పాలు అమ్ముతుండగా,సాయంత్రం 7 గంటలకు నిందితుడు బెజవాడ రాజీవ్‌ఏ రాజు పాల ప్యాకెట్ కొనుగోలు చేసి రూ.500 నకిలీ నోటు ఇచ్చాడు.నోటు నకిలీదని గుర్తించిన కిరణ్ ఫిర్యాదు మేరకు చండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో డీఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో,చండూర్ సీఐ టి.రాము ఆధ్వర్యంలో ఎస్ఐ జె. శివకుమార్,సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.జూన్15న ఉదయం 10 గంటలకు నల్గొండ మిర్యాలగూడ రోడ్డులోని కంచర్ల టవర్స్‌లో ఉంటున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా యూట్యూబ్‌లో వీడియోలు చూసి నకిలీ నోట్ల తయారీ నేర్చుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు.ఆన్‌లైన్‌లో ప్రింటర్,పేపర్ కొనుగోలు చేసి నకిలీ నోట్లు తయారు చేసి చలామణి చేస్తున్నట్లు తెలిపారు.నిందితుల్లో ఏ-1 బెజవాడ రాజీవ్‌ఏ రాజు వయసు 38 సంవత్సరాలు,నల్గొండలో నివాసం ఉంటున్నాడు.అతనిపై ఒక హత్య,ఒక హత్యాయత్నం కేసుతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 7 నకిలీ నోట్ల చలామణి కేసులు ఉన్నాయి.మిర్యాలగూడ × టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది.ఏ-2 దుర్గం పావని వయసు 26 సంవత్సరాలు,సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన గృహిణి.నిందితుల వద్ద నుంచి 15 నకిలీ రూ.500 నోట్లు,నెంబర్ లేని పల్సర్ బైక్,హెచ్‌పీ ప్రింటర్,స్కానర్,100 బాండ్ పేపర్లు,కట్ చేసిన పేపర్లు,కత్తెర,స్పార్కిల్ పెన్,స్టీల్ స్కేళ్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించిన ఎస్ఐ జె.శివకుమార్,ఏఎస్ఐ శ్రీరాములు,కానిస్టేబుళ్లు ఆనంద్ రెడ్డి,శివరాం కృష్ణ,నరేందర్,ఉపేందర్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.చండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నంబర్ 75/2026 కింద బి ఎన్ ఎస్ సెక్షన్లు178,179,180,181 ఆర్/డబ్ల్యూ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 15, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ, ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ - సన్నాహక కార్యక్రమం ప్రారంభమవుతోంది



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 15, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇప్పటికే విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి 24 వరకు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణతోపాటు బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌వో)కు శిక్షణ ఇస్తారు. 25 నుంచి సర్ అసలు కార్యక్రమం ప్రారంభమవుతుంది. రాష్ట్రంలోని ప్రతి ఓటరు వివరాలను పరిశీలించి, అర్హులపేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా కొత్త జాబితాను రూపొందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 88.13 లక్షల మంది ఓటర్ల వివరాల్లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇప్పటికే తప్పులను రెడ్ ఫ్లాగ్ చేసింది. అయితే, ఇది ఓట్ల తొలగింపు ప్రక్రియ కాద ని, ఓట్ల స్వచ్ఛతను పెంపొందించే ప్రక్షాళన మాత్రమేనని ఈసీ చెబుతోంది. 25 నుంచి బీఎల్ వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. దీని ఆధారంగా జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారు. అందులో పేర్లు లేకపోయినా.. తప్పులు దొర్లినా ఓటర్లు సవరణల కోసం దరఖాస్తు చేసేందుకు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు సమయం ఇస్తారు. ఫిర్యాదులపై విచారణ, పరిష్కార ప్రక్రియ ను సెప్టెంబరు 28 నాటికి పూర్తిచేస్తారు. తుది ఓట రు జాబితాను అక్టోబరు 1న ప్రచురిస్తారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారు. ఓటర్లు తమ పేరు, వయసు, కుటుం బ సభ్యుల వివరాలు, చిరునామా వంటి సమాచారాన్ని పరిశీలించి అవసరమైతే సవరణలు సూచించవచ్చు. ఇంటివద్ద ఎవరూ లేకపోతే బీఎల్‌వోలు కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించి వివరా లు సేకరించాలని ఈసీ ఆదేశించింది. బీఎల్‌వోలకు రాజకీయ పార్టీలు నియమించుకునే బూత్ స్థాయి సహాయకు(బీఎల్ఏ)లు సహకరిస్తారు. బీఎల్‌వోలు వచ్చినప్పుడు ఓటరు అందుబాటులో లేకపోతే ము సాయిదా జాబితాలో ఆ ఓటరు పేరుపక్కన మార్క్ చేస్తారు. ఆగస్టులో వీరు ఆన్‌లైన్ ద్వారా లేదంటే.. నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫామ్-8 సమర్పించి తమ ఓటును భద్రపరుచుకోవచ్చు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఓటరు మ్యాపింగ్‌లో సుమారు 88.13 లక్షల ఓటర్ల వివరాల్లో అసమానతలు గుర్తించారు. పేర్లు, వయసు, బంధుత్వం, డూప్లికేట్ నమోదులు, చిరునామా మార్పుల వంటి అంశాలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటిని పరిశీలించి సరిచేస్తారు. 2002లో జరిగిన సర్‌లో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలిస్తారు. పాత రికార్డులతో పోల్చి తప్పులను గుర్తిం చి సరిచేయడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈసీ నియమాల ప్రకారం ఓటుకు పూర్తి రక్షణ కల్పిస్తారు. ఏ ఒక్కరి ఓటును కూడా ముందస్తు నోటీసు ఇవ్వకుండా జాబితా నుంచి తొలగించే అధికారం ఏ అధికారికీ లేదు. ఒకవేళ సాఫ్ట్‌వేర్ తప్పుగా చూపించినా, ఓటరు వివరణ తీసుకున్న తర్వాతే దానిపై నిర్ణయం ఉంటుంది.

**ప్రజలేం చేయాలి..?**

సర్ ప్రక్రియ సమయంలో బీఎల్‌వోలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారాల్లో ప్రతి ఓటరు తమ వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి. తప్పులుంటే సవరణ కోరవచ్చు. 2002లో ఒక నియోజకవర్గంలో ఉండి ప్రస్తుతం మరో నియోజకవర్గంలో నివసిస్తూ అక్కడే ఓటు ఉంటే సాఫ్ట్‌వేర్ దాన్ని గుర్తిస్తుంది. ఓటరు ప్రస్తుతం ఉన్న ఫారంను నింపినప్పుడు 2002 నాటి డేటాబేస్‌లో వారి పేరు, తండ్రి/భర్త పేరును వెదికి పాత రికార్డును కొత్త రికార్డుతో 'లింక్' (క్రాస్ కానిస్టిటెన్సీ) చేస్తుంది. దీనివల్ల పాతచోట ఓటు రద్దవుతుంది. 2002 రికార్డుల్లో మీ ఓటు దొరక్కపోయినా ప్రస్తుత నివాస ప్రాంతంలో మీరు స్థానికులేనని ని రూపించే ప్రత్యామ్నాయ పత్రాలను (ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రిజిస్టర్డ్ సేల్‌డీడ్, పాస్‌పోర్ట్) పరిశీలించి ప్రస్తుత ఓటును ఖరారు చేస్తారు. కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చు. వారి తండ్రి, తల్లికి సంబంధించిన 2002 ఓటరు ఐడీ రికార్డుతో పిల్లల ఓటును లింక్ చేస్తారు. ఓటరు పేరులో అక్షర దోషం లేదా ఇంటిపేరు మార్పు ఉంటే ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి మార్కుల మెమో వంటివాటిని సమర్పించాలి. వయసు లేదా జన్మతేదీల్లో తేడా ఉంటే జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు పత్రాల్లో ఏదో ఒకటి ఇవ్వాలి. తల్లిదండ్రుల పేర్లు, బంధుత్వాల్లో తేడాలుంటే కుటుంబ రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు, పాఠశాల రికార్డులను సమర్పించాలి.

# భారీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

***ఇద్దరు నిందితుల అరెస్ట్, నగదుతో పాటు వెండి, బంగారం స్వాధీనం -జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు***

గద్వాల జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల




పట్టణంలో ఇటీవల జరిగిన ఒక భారీ దొంగతనం కేసును స్థానిక పోలీసులు అత్యంత ప్రతిభావంతంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ. 7,000 నగదుతో పాటు 60 తులాల వెండి, 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన మహబూబ్ వెల్డింగ్ పని చేస్తుండగా, మరొకరు మేస్త్రీగా పని చేసేవారు. వీరిద్దరికీ వచ్చే సంపాదన సరిపోకపోవడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు తెరలేపారు. ఈ క్రమంలో గద్వాల పట్టణంలోని భీమ్ నగర్ పరిసరాల్లో బైక్‌పై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించారు. పథకం ప్రకారం జూన్ 10, 2026 ఉదయం సమయంలో ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగిలించారు. ఆ వస్తువులను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తుండగా పోలీసులకు చిక్కారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ కె. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ, గద్వాల డీఎస్పీ పర్యవేక్షణలో గద్వాల సిఐ శ్రీను, కళ్యాణ్ ఎస్సై ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల దృశ్యాలు, సాంకేతిక నైపుణ్యం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 15, 2026 (ఈరోజు) ఉదయం గద్వాల పట్టణ శివారులోని చెనుగోనిపల్లి వెళ్లే రహదారి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం ఉదంతం వెలుగుచూసింది.కేసును కేవలం 5 రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన గద్వాల సిఐ శ్రీను, కళ్యాణ్ ఎస్సై, పోలీస్ సిబ్బంది (ఇంద్రయ్య, కిరణ్, రామకృష్ణ) లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జూన్ 15 :( విజన్ ఆంధ్ర) వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సీజనల్ వ్యాధుల నివారణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, విష జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం జిల్లాలోని పలు ప్రాంతాలలో డెంగ్యూ వ్యాధితో ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని, ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, మంచి నీరు కలుషితం కాకుండా పైప్ లైన్ లీకేజీలను అరికట్టాలని, నివాస ప్రాంతాల నడుమ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండకూడదని సూచించారు. మురుగునీటి కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలని, నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తప్పనిసరిగా సందర్శిస్తూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా చూడాలని, ప్రతి నివాస ప్రాంతంలో ఫ్రైడే డ్రై డే పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అస్తవ్యస్థ పరిస్థితుల కారణంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు ప్రబలితే, సంబంధిత అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓపెన్ ప్లాట్లలో వర్షపు, మురుగు జలాలు నిలువ ఉండకూడదని, చెత్తా చెదారం వేయకుండా చూడాలన్నారు. ఈ విషయాలపై జాగ్రత్తలు తీసుకోని ప్లాట్ల యజమానులకు అవసరమైతే జరిమానాలు విధించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. విష జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే అవసరమైన చికిత్సలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అన్నివిధాలుగా సన్నద్ధమై ఉండాలని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. దోమల నివారణ మందులను గ్రామ పంచాయితీలలో అందుబాటులో ఉంచుకోవాలని, వారానికి కనీసం రెండు పర్యాయాలు తప్పనిసరిగా పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ బడులలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువగా ఆస్కారం ఉన్న హైరిస్క్ ఏరియాలలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలు సీజనల్ వ్యాధులకు గురి కాకుండా చూడాలని హితవు పలికారు. అనంతరం పొగాకు నియంత్రణపై నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. పొగాకు విక్రయాలకు సంబంధించి నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశాలలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ పి.సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువత పోటీ తత్వాన్ని అలవరుచుకోవాలి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి**



నిర్మల్ జిల్లా, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ద్యావరాశెట్టి రమేష్ జ్ఞాపకార్థంగా నిర్వహించిన 40వ వార్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విజేతలు, రన్నరప్ జట్లకు సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ క్రీడల్లో యువత చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత మరియు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, విజేతలు మరియు రన్నరప్ జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్పీ రాజు, రాఘవేంద్ర చారి, ఆడప పోశెట్టి, నాయకులు ఆడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన ప్రోత్సహికుడికి రాష్ట్ర గవర్నర్ అవార్డు - కలెక్టర్ అభినందనలు



నిజామాబాద్ జూన్ 15:( విజన్ ఆంధ్ర ) ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లోక్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చే ప్రదానం చేసిన వ్యక్తిగత అత్యధిక రక్తదాన ప్రోత్సహికుడు అవార్డును రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ప్రశాంత్ అందుకున్నారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లోక రమణ రెడ్డి తరపున ఈ అవార్డును ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నిజామాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు ఇలా త్రిపాఠి , ఐఏఎస్ అవార్డు గ్రహీత ప్రశాంత్‌ను అభినందించారు. జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరాయంగా రక్తం అందుబాటులో ఉండేందుకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని, సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయాగౌడ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కరిపె రవీందర్, జిల్లా కార్యదర్శి గోక అరుణ్ బాబు, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పుడు ఎవరికి విధించాలి జరిమానా..!!






తెలకపల్లి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : తెలకపల్లి బస్టాండ్ దుస్థితి తీరుపై జరిమానా ఎవరికి విధించాలని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఓ ప్రయాణికుడు తెలకపల్లి నుండి షాద్ నగర్ డిపో బస్సులో నాగర్ కర్నూల్ వెళ్తూ ఫోన్ పే ద్వారా టికెట్టు తీసుకున్నాడు కొద్ది దూరం వెళ్ళాక గాలికి టికెట్టు గల్లంతయ్యింది. మంతటి చౌరస్తా వద్ద టిటిఐలు బస్సును చెకింగ్ చేశారు. సదరు ప్రయాణికుడు తాను తీసుకున్న టికెట్టు గాలికి కొట్టుక పోయిందని ఫోన్ పే ఆధారాన్ని అధికారులకు చూపించగా టి టి ఐ లు, ఆ విషయాన్ని పట్టించుకోకుండా 100 రూపాయలు కండక్టర్ వ్యక్తిగత ఫోన్ పే కు కొట్టించారు. అవే డబ్బులను కండక్టర్ వ్యక్తిగత నెంబర్కు కాకుండా ఆర్టీసీ సంస్థ నెంబర్ కు ఫోన్ పే చేయించి ఉంటే బాగుండేదని ప్రయాణికుడు వాపోయాడు. అదే ప్రయాణికుడు తెలకపల్లి బస్టాండ్ వద్ద బస్సు ఎక్కబోయి గుంతలో పడ్డాడు గుంతలను అధికారులు ఎందుకు పూడ్చడం లేదని ఇప్పుడు జరిమానా ఎవరికి విధించాలని ప్రశ్నించారు..? బస్టాండులో వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేయించి ఆర్టీసీ అధికారులు నెలకు వేల రూపాయలు అద్దెలు వసూలు చేస్తూ బస్టాండ్ సమస్యలు పట్టించు కోకపోవడం శోచనీయకరమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయుడు

**- అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్**



ఆలంపూర్ జూన్ 15(విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు సోమవారం అయిజ మండలంలోని గ్రామాలు, అయిజ మున్సిపాలిటీ కి చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ (రూ. 1,37,15,892)కోటి ముప్పై ఏడు లక్షల పదిహేను వేల ఎనిమిది వందల తొంభై రెండు రూపాయల చెక్కులను ఆలంపూర్ శాసనసభ్యులు విజయుడు,అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అయిజ మండల బి ఎస్ పార్టీ ఇన్చార్జి వావిలాల రంగారెడ్డి,కో ఆప్షన్ మెంబర్స్ నాగన్న గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, అశ్వ పెద్దయ్య, చరణ్ రెడ్డి, బి ఆర్ ఎస్వి అయిజ మండల అధ్యక్షుడు మత్తాలి, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమ్మె విరమణ



మల్కాజిగిరి, జూన్ 15,( విజన్ ఆంధ్ర): గత కొంతకాలంగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించారని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు జే. వెంకటరమణ,అధ్యక్షుడు కే.ఆనంద్, ప్రధాన కార్యదర్శి చిలుమూరు ఆనందరావులు తెలిపారు. సోమవారం కాకతీయనగర్ డివిజన్ తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యం లో భవన నిర్మాణ కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ...గత 15 రోజుల నుండి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పనులను నిలిపి వేసినట్లు తెలిపారు సోమవారం అమావాస్య రోజున సమ్మెను విరమిం చాలని నిర్ణయించామని తెలిపారు. అంతేకాకుండా యూనియన్ లో ఉన్న ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని యూనియన్ కార్డు పొందాల ని వారు కోరారు. ఇంటి యాజమాన్యం, బిల్డర్లు, యూనియన్ కార్డు లేకపోతే భవన నిర్మాణ కార్మికులకు పని ఇవ్వకూడదని నిర్ణయించామని చెప్పారు. ప్రతి అమావాస్య రోజున బిల్డింగ్ నిర్మాణ పనులు చేయకూడదని అసోసి యేషన్ నిర్ణయించినట్లు తెలిపారు. సంఘం ఆదేశాలు పాటించని వారిపై అసోసియే షన్ చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎస్.కె కాసిం సాహెబ్, ఉపాధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర్లు, యూనియన్ సభ్యులు వెంకట్ రెడ్డి, డి.కృష్ణ, యు.శ్రీను, యు. మాధవ, యు.మధు, జె. ఏసురత్నం, టి. వెంకటేశ్వర్లు, డి. వెంకటేశ్వర్లు, టి. పేరయ్య, కే.శ్రీహరి,ఈ.రమణయ్య, టి. మధు తదితరులు పాల్గొన్నారు

## ఖాళీల భర్తీ, శాశ్వత రిజిస్ట్రార్ల నియామకానికి ఎంపీ చామల డిమాండ్



హైదరాబాద్ విజన్ ఆంధ్ర : దేశంలోని జాతీయ ఔషధ విద్యా, పరిశోధనా సంస్థల్లో పరిపాలనా పారదర్శకతను పెంపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు, కౌన్సిల్ మూడో సమావేశంలో ఆయన ఈ అంశాలను ప్రస్తావిస్తూ, అన్ని సంస్థల్లో ఐదేళ్ల పదవీ కాలంతో శాశ్వత రిజిస్ట్రార్లను నియమించాలని, హైదరాబాద్ సంస్థలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కొనసాగడం సముచితం కాదని పేర్కొన్నారు, పరిపాలనా ఖాళీల భర్తీతో పాటు విద్యార్థుల ఉద్యోగావకాశాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు, పాలక మండళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా. విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడంపై స్పష్టత ఇవ్వాలని, కొత్త పాలక మండళ్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు, జీవశక్తి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన జాతీయ జీవలభ్యత కేంద్రాల పనితీరు, ఫలితాలపై సమగ్ర సమాచారం వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు, దేశ ఔషధ రాజధానిగా పేరొందిన హైదరాబాదుకు ఈరంగంలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కోరిన ఎంపీ చామల, ప్రతిభా కేంద్రాల పనితీరు, పరిశ్రమలకు అందిస్తున్న సేవల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు, వికసిత భారత్ 2047 లక్ష్యాలు, తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో జీవ విజ్ఞాన శాస్త్రాల రంగం కీలకమని, మొహాలీ సంస్థ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రఘురాం రావు అక్కినేపల్లి వ్యవహారాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించారు, కేసులో విముక్తి పొందినప్పటికీ ఆయనకు ఇప్పటికీ న్యాయం జరగలేదని పేర్కొంటూ, కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పీ. నడ్డా దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక పోయిందన్నారు, ఆయనకు న్యాయం చేయాలని కౌన్సిల్‌ను కోరారు

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే న్యాయం చేయాలని కోరిన జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి15 జూన్ : ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం చేసి త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వర నయం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ కె హేమావతి అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లాలోని నలు మూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు ఈ సందర్భంగా 150 ఆర్జీలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశిస్తూ సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం రాష్ట్రస్థాయి అధికారులు రాకేష్, శృతిలు జిల్లాలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమం సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు మేలు కలిగేలా వేగంగా ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెల మృతి. రైతుకు రూ.2 లక్షల నష్టం.



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్15(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన రైతు జుట్టు కొండ రమేష్‌కు చెందిన రెండు పాడి గేదెలు సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి.గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడి నేలపై పడిపోయాయి. సోమవారం ఉదయం మేత కోసం వెళ్లిన గేదెలు ఆ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా రైతు జుట్టు కొండ రమేష్ మాట్లాడుతూ, మృతి చెందిన రెండు పాడి గేదెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని, ఒక్కో గేదె విలువ సుమారు రూ.1 లక్ష అని తెలిపారు. గేదెల మృతితో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి తగిన ఆర్థిక సహాయం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు కోరారు. ఘటనపై గ్రామస్తులు కూడా విచారం వ్యక్తం చేశారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మంచిర్యాల ఐబి చౌరస్తాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత మహాజన్ రూపాలి రఘునందన్ దంపతుల సహకారంతో ప్రతినెల నిర్వహించే అమావాస్య అన్నదానంలో భాగంగా దాదాపు ఐదువేల పైగా నిరుపేదలకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, జోన్ చైర్ పర్సన్ లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్ల సూర్యనారాయణ, వాసవి క్లబ్ కార్యదర్శి గుండా మనోహర్, నస్పూర్ మండల్ వాసవి క్లబ్ కార్యదర్శి తోట రాజయ్య, కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విదేశీ దంపతులకు దత్తత ఇచ్చారు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 15 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో మొట్టమొదటి సారిగా సోమవారం రోజున విదేశి దంపతులకు ( ఇంటర్ కంట్రీ అడాప్షన్ ) 18 నెలల పాపను దత్తత ఇవ్వడం జరిగింది మరియు స్వదేశీ దత్తత ఇద్దరిని ఐదు నెలల బాబు ను రంగారెడ్డి జిల్లాకు మరియు తొమ్మిది నెలల పాప ను మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలని బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి అబ్బాయి అయినా అమ్మాయి అయినా బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జప్త శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎ. రాము మరియు శిశు గృహ మేనేజర్ రాజు సామాజిక కార్యకర్త రాజారామ్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరతగతిన పరిష్కరించాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**- గ్రీవెన్స్ లో ఆర్థిదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ**




వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్15(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 202 దరఖాస్తులు ప్రజావాణిలో నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు 64, మున్సిపాలిటీకి 48, హౌసింగ్ శాఖకు 22, డీఆర్‌డీఓకు 10, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చాయి.వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో సాంబశివరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాన్ని కొనసాగించి వినతులు స్వీకరించారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ అందజేయాలి..-టీడబ్ల్యూజేఎఫ్

***వికారాబాద్ డీఈవోకు వినతి పత్రం అందజేసిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు..***



ఒవికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 15 (విజన్ ఆంధ్ర) అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామచందర్, జిల్లా కార్యదర్శి షఫీ లు కోరారు. ఈ క్రమంలో సోమవారం వికారాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈఓ అబ్దుల్ ఘనిని కలిసి టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారి పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం రాయితీ అందజేస్తోందని అన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి కూడా ఫీజు రాయితీ కల్పించే విధంగా జిల్లా పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు తగు సూచనలతో ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందిం చిన డీఈఓ వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల విజ్ఞప్తికి సానుకూల నిర్ణయం పట్ల టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీలు చేసిన జిల్లా రవాణా అధికారి రాధిక




గద్వాల జూన్ 15( విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణ,మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో జిల్లా రవాణా అధికారి రాధిక సోమవారం స్కూల్ బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బస్సుల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను పరిశీలించారు. బస్సుల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఎమర్జెన్సీ డోర్లు ఉన్నాయా,భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అలాగే వాహనాలకు సంబంధించిన పత్రాలు ఫిట్‌నెస్,అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఒక ప్రైవేట్ పాఠశాల బస్సును సీజ్ చేసినట్లు డీటీఓ రాధిక తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అన్ని పాఠశాల యాజమాన్యాలు రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆమె హెచ్చరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో కానిస్టేబుల్ గోవర్ధన్,హోంగార్డులు బుషి,గోవింద్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 12 ఏళ్ల చిన్నారిని అత్యాచారం చేసిన గౌస్ పాషా ని ఎన్కౌంటర్ చేయాలి

**- జిల్లా కలెక్టర్, ఎస్పీ కి వినతి పత్రం అందజేసిన జిల్లా చాకలి ఎస్సీ సాధన సమితి**



గద్వాల జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా సోమవారం జిల్లా చాకలి ఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ని, ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు లను కలిసి ఖమ్మం జిల్లా, తల్లంపాడు గ్రామానికి చెందిన (చాకలి కులస్థుల) 12 ఏళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హత్య ప్రయత్నం చేసిన గౌస్ పాషా ని ఎన్కౌంటర్ చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిన్నపాటి రజక నరసింహులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా, తల్లంపాడు గ్రామానికి చెందిన (చాకలి కులస్థుల) 12 ఏళ్ల చిన్నారిని అదే అపార్ట్మెంట్లో 3వ ఫ్లోర్ లో ఉంటున్న 50 ఏళ్ల వయసున్న గౌస్ పాషా ఆ చిన్నారిని అదే అపార్ట్మెంట్ పైకి తీసుకువెళ్లి రెండు చేతులు కట్టివేసి అత్యాచారం చేసి హత్య చెయ్యడానికి మూడో అంతస్తు నుండి క్రిందికి పడవేసిన వ్యక్తిని జైల్లో పెట్టి మేపడం కాదు తక్షణమే ఎన్కౌంటర్ చేయాలని జిల్లా కలెక్టర్ ని, జిల్లా ఎస్పీ ని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్సీ సాధన సమితి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు ఆంజనేయులు మండల అధ్యక్షుడు సవరన్న, గ్రామ అధ్యక్షుడు మల్లికార్జున్, డాక్టర్ శ్రీనివాసులు, కేటి దొడ్డి మండల అధ్యక్షుడు వెంకటేశ్ ,గువ్వలదిన్నె తిమ్మప్ప, పాతపాలెం మల్లేష్, నరేష్, అల్లపాడు గోపాల్, ఇందువాసి నరసింహులు, గద్వాల పట్టణ అధ్యక్షుడు బిజ్వారం నరసింహులు, ఉపాధ్యక్షులు కోట్ల వీరేష్, జిల్లా నాయకురాలు రజక జయశ్రీ (మాజీ మున్సిపల్ కౌన్సిలర్), మున్సిపల్ కౌన్సిలర్ లతా రామకృష్ణ, రామకృష్ణ, జయన్న, జిల్లా నుండి వివిధ మండల గ్రామ రజక సంఘం నాయకులు పాల్గొని వినతిపత్రం అందజేశారు.

## రాష్ట్ర డిప్యూటీ సీఎం కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాద్ నందు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నందు రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మర్యాదపూర్వ కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.భవిష్యత్తులో ఇలాంటి పుట్టినరోజులు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ప్రజాసేవలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని కోరుకున్నారు.

## శ్రీ శ్రీ రచనలు సమాజానికి స్ఫూర్తి

**- ఈ సి నగర్ లో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ**



కాప్రా /జూన్ 15(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : నేటికీ శ్రీ శ్రీ రచనలు సమాజానికి స్ఫూర్తి అని ఈ సి నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఎం జగ్గరాజు పేర్కొన్నారు. మహాకవి శ్రీ.శ్రీ. వర్ధంతి సందర్భంగా ఈసీ నగర్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ హాల్లో సోమవారం సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. సభకు ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఎం. జగ్గరాజు ముఖ్య అతిథిగా హాజరై మహాకవి శ్రీ.శ్రీ. తెలుగు సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఆయన రచనలు సమాజ చైతన్యానికి, అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. శ్రీ.శ్రీ. సాహిత్య ప్రస్థానం, ఆయన కవిత్వంలోని సామాజిక స్పృహ, విప్లవాత్మక ఆలోచనలను గుర్తు చేసుకుంటూ నివాళు లర్పించారు. ఈ సభలో సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ కార్యదర్శి గోపాలకృష్ణ, ఈ సి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి బాల్ రెడ్డి, ఏ బి చారి, బి వి రాజు, విప్లవ సాహిత్యాభిమానులు, సీనియర్ సిటిజన్లు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## గ్రామంలో బెల్ట్ షాపులను బంద్ చేయించాలని రోడ్డుపై ధర్నా నిర్వహించిన మహిళలు, గ్రామస్తులు.

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 విజన్ ఆంధ్రకొమరంభీం జిల్లా సిర్పూర్ టీ మండలం వేంపల్లి గ్రామంలో మద్యపానం నిషేధించాలని గ్రామస్థులు సిర్పూర్ టీ కాగజ్ నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 15 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయని మద్యం సేవించే తమ ఊర్లో గొడవలు బాగ జరుగుతున్నాయని అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని రోడ్డు మీద బైటాయించి ఆందోళన చేపట్టారు, దీంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి, సంఘటన స్థలానికి చేరుకున్న ఎక్స్చేంజ్ ఎస్.ఐ బెల్టు షాపులను బంద్ చేపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# చిన్నారుల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- ఆర్ఎన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



నిజామాబాద్ జూన్15:( విజన్ ఆంధ్ర ): చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్య శిక్షణ పొందిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ సమద్ జిల్లా కేంద్రంలో ఆస్పత్రిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రిలో చిన్నారులకు సంబంధించి అన్ని రకాల వైద్య పరికారాలను అందుబాటులో ఉంచుతూ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ, తమ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వారం రోజులపాటు చిన్నారులకు ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మేయర్ కూరగాయల ఉమారాణి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఆస్పత్రి మేనేజర్ మమ్మద్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# లోకారి కే లో ప్రాథమిక పాఠశాల నూతన భవన ప్రారంభం

**- ఎంపీ గోడం నాగేష్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



గాదిగూడ,15(విజన్ ఆంధ్ర):సమాజ నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.సోమవారం గాదిగూడ మండలంలోని లోకారి (కె) గ్రామంలో నూతనంగా నిర్మించిన "మండల ప్రాథమిక పాఠశాల" నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్,ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవా లక్ష్మి తో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై,పాఠశాల భవనాన్ని ప్రారంభించి,పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.అంతకుముందు అతిథులు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అన్ని వసతులతో కూడిన నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తోందని తెలిపారు. "ప్రభుత్వ బడులలో చదువుదాం – మీ పిల్లల జీవితానికి వెలుగులు నింపుదాం" అనే నినాదాన్ని తల్లిదండ్రులంతా నిజం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా చక్కని విద్యా బోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఇక్కడ డిజిటల్ మౌలిక వసతులు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామస్తులు, పాఠశాల యాజమాన్య కమిటీ సమన్వయంతో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు.ఎంపీ మాట్లాడుతూ లోకారి (కె) గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభం కావడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యా రంగ రూపురేఖలను మారుస్తున్నామని, విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులెవరూ తమ పిల్లలను చదువుకు దూరం చేయవద్దని, బడి వయసు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని మరిన్ని పాఠశాలల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం, గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే కలిసి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, స్థానిక సర్పంచ్ మండాడీ పుష్పలత జాకు,ఉప సర్పంచ్ఎంఆత్రం చందు, ఎంఈఓ రమేష్,ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ, ప్రాధనోపాధ్యాయులు దిలీప్ఇ చవాన్,డిఈఓ, గ్రామ పటేల్ మెస్రం భీంరావ్, ఝురి సార్మేడి మండాడి దౌలత్ రావ్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్,మెస్రం శేఖర్ టీచర్, లింగు టీచర్,ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షులు పెందోర్ సంతోష్,కొడప జకు, పూసం బాధిరావ్ సర్పంచ్, మాజీ సర్పంచ్ దేవురావ్, ఇంద్రబాన్,మాజీ ఎంపీటీసీ నాగోరార్,పంచాయతీ కార్యదర్శి విజయ్స కుమార్ సర్పంచ్ లు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

**- విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల్ జూన్ 15( విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రభుత్వ పాఠశాలలలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించి ఉపాధ్యాయుల వివరాలు అడిగారు. పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన కమిటీని విద్యార్థులతో ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయించాలన్నారు. తరగతి గదులతో పాటు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారిస్తే పదవ తరగతిలో మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. గతేడాది టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకంటే ఈ విద్యా సంవత్సరంలో ప్రస్తుత విద్యార్థులు బాగా చదివి ఇంకా ఎక్కువ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సెలవులను ఎలా సద్వినియోగం చేసుకున్నారని, సమ్మర్ స్పెషల్ తరగతులకు ఎంతమంది హాజరయ్యారని అడిగారు. విద్యార్థులకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేయడం జరిగిందని, త్వరలోనే ఏకరూప దుస్తులను కూడా ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 15( విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులలొ 32 శాతం పెండింగ్ లో ఉన్నాయని త్వరితగతిన వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణికి మొత్తం 55 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కి వచ్చిన ఫిర్యాదులను ఆన్ లైన్ లొ నమోదు చేయడం జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు సంబంధిత వెబ్ సైట్ నుంచి ఫిర్యాదులను తీసుకొని పరిష్కరించాల్సి ఉందన్నారు. సర్వే, రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, డిఆర్డిఏ, విద్యుత్ శాఖల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజావాణి ఆర్జీలు రావడం జరిగిందని, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.పాఠశాలలు ప్రారంభమైనందున మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించి పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా కనీసం 20 శాతం ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల చిన్నారులందరూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయడం జరిగిందని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.అంతకుముందు హైదరాబాదు నుంచి వచ్చిన ప్రజావాణి సమన్వయకర్త సహదేవ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజావాణి దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించకుంటే సంబంధిత శాఖల నుంచి ఆర్జీలను కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రజావాణిపై జిల్లా నుంచి ముగ్గురు అధికారులకు శిక్షణ ఇచ్చారని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖలో అత్యధికంగా ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, భూ సమస్యలను ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుతం ప్రజావాణిని రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నారని రాబోవు రోజుల్లో మండల స్థాయిలోనూ నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉదండాపూర్ ప్రాజెక్టు ఆలస్యం

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**- జడ్చర్ల అభివృద్ధే లక్ష్యంగా బైపాస్, రెవెన్యూ డివిజన్ కోసం కృషి చేస్తున్నాం**

**- గత ప్రభుత్వ హయాంలో జడ్చర్ల నియోజకవర్గంలో అవకతవకలు, కుంభకోణాలు జరిగాయి**

**- జూలై నాలుగు లేదా ఐదున మిడ్జిల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ**

**- మిడ్జిల్-ఉర్కొండ మండలాలకు భారీ అభివృద్ధి నిధులు రానున్నాయి**

**- రంగనాయకస్వామి గుట్టపై భారీ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటు**

**- బిఎల్ఏలకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై శిక్షణ ఇచ్చాం**



జడ్చర్ల, జూన్ 15, (విజన్ ఆంధ్ర): జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని చంద్ర గార్డెన్స్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బిఎల్ఏలకు అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల ఐదున జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఉదండాపూర్ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఎమ్మెల్యే విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి ప్రాజెక్టును పూర్తి చేస్తానని హామీలు ఇచ్చినా అమలు చేయలేదన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉదండాపూర్ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఆరు వందల ముప్పై ఒకటి కోట్ల నిధులు మంజూరు చేసి చిత్తశుద్ధి చాటుకున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు నీటి కేటాయింపుల సమయంలో అప్పటి పాలమూరు ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఉదండాపూర్ ప్రాజెక్టుకు నిధులు, ప్రాధాన్యత తీసుకురాలేకపోయారని విమర్శించారు. ఆ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుని ఉంటే ఉదండాపూర్ ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నాయకత్వంపై కూడా విమర్శలు చేసిన ఎమ్మెల్యే, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి అంశాలు ప్రభుత్వ దృష్టికి తేలేకపోయారన్నారు. తాను మాత్రం జడ్చర్లకు బైపాస్ రహదారి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వంటి కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జడ్చర్ల నియోజకవర్గంలో అవకతవకలు, కుంభకోణాలు జరిగాయని ఆరోపించిన ఎమ్మెల్యే, ప్రజలు వాటిని గమనించి ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిజమైన తీర్పు ఇస్తారని అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని రంగనాయకస్వామి గుట్టపై భారీ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ కార్యక్రమానికి కొందరు రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇరవై సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్, ఉర్కొండ మండలాలకు భారీ అభివృద్ధి నిధులు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. జూలై నాలుగు లేదా ఐదవ తేదీన మిడ్జిల్ మండల కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ నెల పదిహేడవ తేదీన జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. బిఎల్ఏలకు నిర్వహిస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్స్, బైక్ రైడర్ ఉద్యోగాల అవకాశాలు

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి జి. ప్రశాంతి**

గద్వాల జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్స్, బైక్ రైడర్ ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి జి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 23 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు డ్రైవింగ్/రైడింగ్ అనుభవం, ప్రాథమిక ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. క్యాబ్ డ్రైవర్ల ఉద్యోగానికి 100 శాతం కంపెనీ ఆధారిత నియామకం ఉంటుంది. వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కంపెనీ ద్వారా కల్పించబడతాయి. నెలకు ఏఈడీ 2,500 నుండి ఏఈడి 4,000 వరకు వేతనం (సుమారు రూ.64,850 నుండి రూ.1,03,770 వరకు) అందించబడుతుంది. బైక్ రైడర్ ఉద్యోగానికి కూడా 100 శాతం కంపెనీ ఆధారిత నియామకం ఉంటుంది. నెలకు ఏఈడి 2,500 వరకు వేతనం (సుమారు రూ.64,850 వరకు) అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 25, 2026 లోపు దరఖాస్తు https://docs.google.com/forms/d/e/1FAIpQLSdF0IAtwr76Ylo0djElaIdMDzQo6o4`ohUJDHwj5PQy1COI_g/viewform?pliR1 సంబంధిత లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, పోలీస్ వెరిఫికేషన్/సిఐడి.లేదా ఇతర సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440049520, 9440048590 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. ప్రశాంతి తెలిపారు.

# కొల్లాపూర్‌లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి...

**- పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించిన కలెక్టర్**

**- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



కొల్లాపూర్ జూన్ 15 : (విజన్ ఆంధ్ర) : కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ పనుల పురోగతిని సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా పట్టణంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత పనుల్లో నిమగ్నమైన పారిశుద్ధ్య కార్మికులతో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు, పని పరిస్థితులు, సంక్షేమ చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, వారికి అవసరమైన భద్రతా పరికరాలు, గ్లోవ్స్, మాస్కులు, గౌన్లు తదితర రక్షణ సామగ్రి అందుబాటులో ఉన్నాయా అని అధికారులను ప్రశ్నించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది కొరత, పరికరాల లభ్యత వంటి అంశాలపై కార్మికుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, వారి భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలో పరిశుభ్రత, పచ్చదనం, వ్యర్థాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నాగమణి, వెంకట లక్ష్మయ్య, మౌనిక, శ్రీనివాస్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉందో, ప్రభుత్వం నుంచి దశలవారీగా విడుదలయ్యే ఆర్థిక సాయం సకాలంలో అందుతోందో లేదో తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల అవుతున్నాయా, ఏవైనా బకాయిలు ఉన్నాయా, నిర్మాణ సామగ్రి సమకూర్చుకోవడంలో ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సహాయం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, పెండింగ్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో భాగంగా కొల్లాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా కలెక్టర్ సందర్శించారు. కాంప్లెక్స్‌లోని దుకాణాల వినియోగం, అద్దె ద్వారా లభిస్తున్న ఆదాయం, నిర్వహణ వ్యవస్థ, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరిగేలా అందుబాటులో ఉన్న వాణిజ్య స్థలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు .

## కొల్లాపూర్‌లో హార్టికల్ కళాశాలల ఏర్పాటుకు స్థలాల పరిశీలన చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పటేల్



కొల్లాపూర్ జూన్ 15 : (విజన్ ఆంధ్ర) : కొల్లాపూర్ పట్టణానికి ఇటీవల మంజూరైన హార్టికల్చర్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూముల స్థలాలను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలాల భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, విద్యాసంస్థల నిర్మాణానికి అనుకూలత, భవిష్యత్ విస్తరణ అవకాశాలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన స్థలాలను ఎంపిక చేయాల్సిన అవసరాన్ని, అలాగే భవిష్యత్‌లో విద్యాసంస్థల విస్తరణకు అవకాశం ఉండేలా ప్రణాళికాబద్ధంగా భూములను కేటాయించాలని, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హార్టికల్చర్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు వల్ల కొల్లాపూర్ ప్రాంతంలో విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగమైన హార్టికల్చర్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు రైతులకు చేరువ కావడానికి ఈ విశ్వవిద్యాలయం దోహదపడుతుందని అన్నారు.భూసేకరణ, స్థలాల బదిలీ, అనుమతుల మంజూరు వంటి ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా సంస్థల ఏర్పాటుతో కొల్లాపూర్ పట్టణం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ పురోగతికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు .

# జూన్ 16 న పర్యాటక కేంద్రం అయిన గండి కోట లో "ప్రత్యేక యోగా ప్రదర్శన"

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



కడప,జూన్ 15: (విజన్ ఆంధ్ర)యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మానసిక ఉల్లాసం పొందవచ్చునని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర క్యాంపెయిన్-2026' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.నేటి వేగవంతమైన జీవనశైలి లో ఒత్తిడి,ఆందోళన, మధుమేహం,రక్తపోటు వంటి సమస్యలకు "యోగా" ఒక దివ్య ఔషధంగా సమర్థవంతమైన పరిష్కారాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 16 గండికోట లో ప్రత్యేక యోగా ప్రదర్శన ప్రత్యేక యోగ ప్రదర్శన కార్యక్రమం ఉ.6 గం.ల నుండి ఉ.7 గం.ల వరకు జరిగే కార్యక్రమం లో ప్రతి కుటుంబం వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా యోగా కార్యక్రమం లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. జూన్ 21 రాజా రెడ్డి స్టేడియంలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన వేడుక. ఈ కార్యక్రమాల ద్వారా యోగా గొప్పతనాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు, ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.జిల్లా లో యోగాంధ్ర కార్యక్రమాల సమర్థ నిర్వహణ కోసం.జిల్లా, మండల, గ్రామ/వార్డు స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 26 మంది సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందన్నారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని.శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే భారతీయ ఋషుల ఆరోగ్య జ్ఞానం నుండి ఉద్భవించిన అమూల్య సంపద అన్నారు. యోగా మన దిన చర్యలో భాగం అయితే కలిగే లాభాలను కూడా ఆయన తెలిపారు. ఎశీస్త్రుఋఅస్త్రశీఖ.ఖజూ.స్త్రశీజ.ఱఅ పోర్టల్ లో నమోదు చేసుకోండి. యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ yogandhra.ap.gov.in పోర్టల్ లోనమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరినీ యోగాభ్యాసం వైపు మళ్లించాలనికూడా జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. "యోగ" ద్వారా మానసిక ఉల్లాసం పొందేందుకు మన దిన చర్య లో "యోగా" ఒక భాగం కావాలి యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి కుటుంబం దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ద్వారా జిల్లాలో లక్షలాది మందికి యోగా చేరువై, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రతి ఇంట్లో యోగా. ప్రతి మనిషికి ఆరోగ్యం" అనే లక్ష్యంతో యోగాంధ్ర క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 15 (విజన్ ఆంధ్ర): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, జెడ్పి సీఈవో యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగ కలెక్టర్ అధికారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చి పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 77 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : భారత దేశంలో ప్రస్తుతం పోలియో మహమ్మారి లేనప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ వంటి దేశాల్లో ఇప్పటికీ పోలియో మహమ్మారి ఉన్నందున భారత దేశంలో పోలియో రాకుండా ఉండేందుకు 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్న పిల్లలకు జూన్ 28న పోలియో చుక్కలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఇందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేసి వనపర్తి జిల్లాలో 0-5 సంవత్సరాల ప్రతి ఒక చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 28న ఆదివారం ఉన్నప్పటికి ఏ ఒక్క పిల్లాడు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఇప్పటికే పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ఉన్నప్పటికీ ఆదివారం వేసే పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని కలెక్టర్ వివరించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం పై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. మండల విద్యా అధికారులు, అంగన్వాడీ సూపర్వైజర్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి వనపర్తి జిల్లాలో ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేసి వందశాతం విజయవంతం చేసేవిధంగా విధి విధానాలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి తల్లితండ్రులు తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని సూచించారు.

**జులై, 13న నులిపురుగుల నివారణ దినోత్సవం**

పల్స్ పోలియోతోపాటు జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలు వచ్చే అనీమియా, జీర్ణ వ్యవస్థ సమస్యలు, పిల్లలు శారీరకంగా ఎదగకపోవడం వంటి సమస్యల నుండి విముక్తి కల్పించడానికి నులిపురుగుల నివారణ దినోత్సవం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1-19 సంవత్సరాల బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రను తినిపించడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరం వయస్సు నుండి కళాశాలలో చదివే పిల్లల వరకు వయస్సు, మోతాదు ను బట్టి మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు తినిపించి వనపర్తి జిల్లాను అనీమియా రహిత జిల్లాగా మార్చాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పిల్లలకు అవసరమైనన్ని పోలియో వయోలిన్ లు , ఆల్బెండజోల్ మాత్రలు ఉన్నాయని, జూన్, 28న ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేసే విధంగా పకడ్బందీగా ప్రణాళికలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా జులై 13న జాతీయ నులిపురుగుల నివారణ రోజున 1-19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, డి. ఆర్ ఓ సూర్యప్రకాష్ , జడ్పీ సి ఈ ఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ నిబంధనలకు అనుగుణంగా, వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం పానగల్ మండలంలోని జమ్మాపూర్, శాఖాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం సేకరణ, తూకాలు, లోడింగ్, తరలింపు ప్రక్రియలను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ నిబంధనలకు అనుగుణంగా జరగాలని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల మేరకు పరిశీలించి సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రాల్లో హమాలీల సంఖ్యను పెంచాలని, ధాన్యం లోడింగ్, అన్లోడింగ్ పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన ట్రక్ షీట్ల అప్డేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, తద్వారా రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు, లోడింగ్ ప్రక్రియ ఎంత వేగంగా పూర్తవుతుందో దానికి అనుగుణంగా సరిపడా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనపై అపోహలు వద్దు

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- జూన్ 23న జిల్లా కేంద్రంలో '2ఖ రన్' నిర్వహణ**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ (15 విజన్ ఆంధ్ర) : ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్ ఐ ఆర్ పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం చేపట్టనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత కీలకమైందని తెలిపారు. ముఖ్యంగా డబుల్ ఓట్లను గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలందరూ ఇటువంటి అపోహలు లేకుండా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూరించే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేసేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి అర్హుడైన ఓటరు ఈ ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్పై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లా కేంద్రంలో ఈ నెల 23వ తేదీన 2కే రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వనపర్తి బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమయ్యే ఈ 2కే రన్ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బడి పిల్లల హాజరుపై... అమావాస్య ప్రభావం

బోథ్, జూన్ 15. (విజన్ ఆంధ్ర) : వేసవి సెలవుల అనంతరం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. కాగా పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజే అమావాస్య రావడంతో సెంటిమెంట్ కారణంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపలేరు. దీంతో పిల్లలు లేక తరగతి గదులు వెలవెలబోయాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ ప్రభావం కనిపించింది. కొన్ని గ్రామాల్లో కేవలం 10 నుండి 15 శాతం లోపే హాజరు నమోదైందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అమావాస్య రోజు పిల్లలను పాఠశాలకు పంపడం మంచిది కాదనే నమ్మకంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికే పరిమితం చేశారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడం ఆది కూడా ఈ సీజన్ లో అతి పెద్ద వర్షం ఆదివారమే కురవడంతో చాలా మంది రైతులు సోమవారం తమ తమ పంట పొలాల్లో విత్తనాలను నాటారు. దీంతో చాలా మట్టుకు రైతులు తమ పిల్లలను విత్తనాలను నాటడానికి పంట పొలాల్లోకి తీసుకెళ్లారు. అమావాస్యకు తోడు వ్యవసాయ పనులు కూడా పిల్లలు బడికి హాజరు కాకపోవడానికి మరో కారణం అయ్యింది. వేసవి సెలవుల తర్వాత బడులు తెరుచుకోవడంతో ప్రభుత్వం పాఠశాలలను అందంగా ముస్తాబు చేసినప్పటికీ అమావాస్య తో పాటు కొన్ని చోట్ల విత్తనాలు నాటడం కూడా విద్యార్థుల హాజరుకు అడ్డంకిగా మారాయి.

రెండు రోజుల్లో అసలైన సందడి ప్రారంభం

తొలి రోజు అమావాస్య సెంటిమెంట్ తో క్లాస్ రూమ్ లు ఖాళీగా కనిపించాయి. రెండో రోజు మంగళవారం కూడా అంతంత మాత్రంగానే పిల్లలు బడికి హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం నుండి పాఠశాలలకు పూర్తి స్థాయిలో విద్యార్థులు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా నేటి సాంకేతిక యుగంలో కూడా పాఠశాలల హాజరుపై అమావాస్య సెంటిమెంట్ ఈ స్థాయిలో ప్రభావం చూపడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# తప్పు చేయకపోతే భయం ఎందుకు?

**- కలెక్టరేట్ ముందు ముందెన్నడూ లేని ఆంక్షలు దేనికి?**

**- అధికారుల అవినీతిని ప్రశ్నిస్తే పోలీసులతో అణచివేస్తారా?**

**- 'ప్రజావాణి'కి వెళ్లకుండా నేతలపై పహారా పెట్టడంపై మండిపాటు**

**- బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ధ్వజం**





వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : జిల్లా అధికారులు ఎలాంటి తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారని, ఎప్పుడు లేని విధంగా కలెక్టరేట్ ముందు పదుల సంఖ్యలో పోలీస్ బందోబస్తు దేనికోసం ఏర్పాటు చేశారని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి కుంభకోణంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేయాలనుకోవడం అవివేకమే అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు కలెక్టరేటుకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో జిల్లా అధికారులు కలెక్టరేట్లో ఎప్పుడు లేనివిధంగా పోలీసుల పహారా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. తాము ఎటు వెళ్తే అటు పోలీసులను వెంట తిప్పుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. తాము దేశద్రోహులమో లేక తీవ్రవాదులమో కాదని, జిల్లా అధికారుల అవినీతి బాగోతం బయటపెడతామంటే ఎందుకంత ఉలిక్కిపాటు అంటూ పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అవినీతితో చెలరేగిపోతామంటే చూస్తూ ఊరుకోమని, జిల్లా అధికారుల అవినీతి బాగోతంపై ఢిల్లీలో ఫిర్యాదు చేస్తామని, అదేవిధంగా మంగళవారం హైదరాబాదులో నిర్వహించే ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వచ్చే సోమవారం లోపు డిఎస్ఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే వందల సంఖ్యలో రైతులను సమీకరించి కలెక్టరేటును ముట్టడించే కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం

**- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 15 విజన్ ఆంధ్ర : బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం అని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి జి. కళార్చన ఆదేశాలనుసారశీ సోమవారం వనపర్తి జిల్లాలోని చాణక్య పాఠశాలలోనీ ఉపాధ్యాయులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు లేదా శిశు సంక్షేమ శాఖ అధికారికి తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు. అదేవిధంగా ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు కూడా వృద్ధులను గౌరవించాలని వారి వయసు రీత్యా జరిగే పొరపాట్లను తప్పులుగా గుర్తించవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మరియు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు షాజూ పాల్ పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలి

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- సమస్యలు విన్న వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు**

**- సోమవారం ప్రజావాణిలో 25 ఫిర్యాదుల స్వీకరణ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 15 విజన్ ఆంధ్ర : బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి న్యాయం చేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా 25 మంది ఫిర్యాదుదారులను కలిసి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. బాధితుల అర్జీలను పరిశీలించిన వెంటనే ఎస్పీ సునిత రెడ్డి స్పందిస్తూ... సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ స్వయంగా చొరవ చూపి, తమకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించడం పట్ల ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 25 ఫిర్యాదులలో భూ సమస్యలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఏ-2లదే కీలక పాత్ర

**- వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి**

**- క్షేత్రస్థాయిలో అలసత్వం వహిస్తే అడ్మినిస్ట్రేషన్కు ఇబ్బందులు తప్పవు**

**- త్వరలోనే బీసీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఎన్ఎస్యూఐ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం**

**- వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్షా సమావేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కేంద్ర ఎన్నికల సంఘం సర్ ( స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (శీతీ) ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష పై బిఎల్ఎ-2 సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని వనపర్తి డిసిసి చీఫ్ యువసేన రెడ్డి సూచించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా, పట్టణ, మండల అధ్యక్ష కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన విధి విధానాలను, నూతనంగా నియమించిన పట్టణ మండల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిసిసి చీఫ్ శివసేన రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్క కార్యకర్తను అక్కున్న చేర్చుకొని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎవరికైనా ఇబ్బందులు వచ్చినా వారిని సైతం కలుపుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా, అసెంబ్లీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు కాంగ్రెస్ పార్టీ ఫలితాలు మళ్లీ పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీల ద్వంద వైఖరి ఒకటేనని, ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పుకొట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచి అధిష్టానం వరకు ప్రతిపక్షం నాయకులు ఎవరైనా అనుచిత వ్యాకలు చేస్తే ఉపేక్షించేది లేదని, వారి మాటలను ఖండిస్తూ కౌంటర్ చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ సత్య రెడ్డి, కోళ్ల వెంకటేష్, శరవంద, మన్యం, బి.కృష్ణ ,పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, సహదేవు, దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, విష్ణు ముదిరాజ్, రవి కిరణ్, బోయెజ్ పలువురు పాల్గొన్నారు.

# మున్సిపల్ నూతన కార్యాలయ భవన పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



నిర్మల్ జిల్లా,జూన్ 15 (విజన్ ఆంధ్ర) : నిర్మల్ పట్టణంలో పాత మున్సిపల్ భవనము వెనుక నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు మరియు అవసరమైన సౌకర్యాలపై అధికారులతో కలిసి పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోపు గోపి, పెందం శ్రీనివాస్, రాఘవేంద్ర చారి, గుంజల చైతన్య, లక్కాకుల హరీష్, మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, నల్లూరి పోశెట్టి, నాయకులు ఆడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. .

# ఆపదలో ఉన్న విశ్వకర్మ సంఘం సభ్యులను ఆదుకుంటాం

**-: కుందారం గణేష్ చారి**



మల్కాజిగిరి, జూన్ 15,(విజన్ ఆంధ్ర): ఆపదలో ఉన్న సభ్యులకు విశ్వకర్మ సంఘం తప్పకుండా ఆదుకుంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కుందారం గణేష్ చారి, అనంతోజు బ్రహ్మచారి,నరసింహచారి భరోసానిచ్చారు. గత ఐదు సంవత్సరాలు క్రితం కరోనా బారిన పడిమృతి చెందిన కుటుంబానికి సోమవారం జనగామ జిల్లా పరపతి సంఘం ద్వారా రూ 70,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ఐదు సంవత్సరాల క్రితం (అనగా 2021 నవంబర్ లో) ఈరవెన్ను గ్రామం పాలకుర్తి మండలానికి చెందిన మన కుల సంఘం సభ్యుడు బత్తోజు సంపత్ చారి కరోనాతో చనిపోయాడు. ఆ సమయంలో జనగామ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపు న మేము 32,200/-లి రూపాయలను అందజేశామని చెప్పారు. మృతుడి కుటుంబానికి అందజేసిన ఆ డబ్బులను జనగామ పరపతి సంఘంలో పొదుపు ఖాతాలో జమచేసి, ఐదు సంవత్సరాల తర్వాత డబల్ అమౌంటు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. నేటికీ ఇంకా ఐదు సంవత్సరాలు పూర్తి కాకముందే డబల్ కంటే ఎక్కువగా మృతుని కుటుంబానికి 70,000 రూపాయలు నగదు అందజేసినట్లు రాష్ట్ర నాయకులు కుందారం గణేష్ చారి, అనంతోజు బ్రహ్మచారి, నరసింహచారి తెలిపారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి.

**- జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా**



కడప,జూన్ 15 (విజన్ ఆంధ్ర) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా.అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలని,త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా తోపాటు సబ్ కలెక్టర్ భావన హాజరై ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు. ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు. 1) పెద్దముడియం మండలం బోడి తిప్పనపాడుకు చెందిన రాచకుంట శ్రీనివాసులు. తనకు కడప జిల్లాలో ఏహెచ్ఏ పోస్టుల భర్తీలో తక్కువ మార్కులు ఉన్నవారికి మరియు నోటిఫికేషన్ రూల్స్ కు వ్యతిరేకంగా పోస్టింగ్ ఇచ్చారని.తమ ఉద్యోగాలు మాకు వచ్చేలా న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.2) వీరబల్లి మండలం పెద్దవీడు గ్రామంకు చెందిన సి రాజారెడ్డి సర్వే నంబర్ 210, 9లో 45 సెంట్లు భూమిని వేరే వ్యక్తులు ఏపీ ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని.విచారించి వారి పేరు రద్దుచేసి తన పేరుపైన నమోదు చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.అ) రేపల్లె గ్రామానికి చెందిన టీ.దస్తగిరి తన భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించు కున్నారని న్యాయం చేయాలని కోరుతూ అభ్యర్థనను సమర్పించారు. 4) కడప మండలం పకీరుపల్లె కు చెందిన వేల్పుల మంజుల తన భర్త అనారోగ్య కారణాలతో చనిపోయారని. తన వయస్సు 57 సం.లు ఉన్నాయని వితంతు పెన్షన్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. 5) కడప మండలం హరిజనవాడకు చెందిన మన్నెం పేరమ్మ తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయగలరని కోరుతూ అర్జీని సమర్పించారు.6) గోపవరం మండలంకు చెందిన టి.రమేష్, టీ. పవిత్ర లకు ~ూబౌ=జు×ూ పాఠశాల రాయచోటి నుండి వారి పల్లెకు ట్రాన్ఫర్ చేయాలని కోరుతూ అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, రంగస్వామి, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్-15(విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఆయనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించగా, పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంతకుముందు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా సేవలందించిన కొప్పుల వెంకట్ రెడ్డి, సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని తన కొత్త బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, జిల్లాలో ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేసే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనలో సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన వెల్లడించారు.

# ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 15 (విజన్ ఆంధ్ర): ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్ 188, 190, 119 లో ఎస్సీ ఎస్టీ వారు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కల గడ్డకు చెందిన టి.ఉమా రాణి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కె.రమేష్ బాబు తనకు సర్వే నెంబర్ 24/హెచ్/6 లో 2 ఎకరాల 31 గుంటల భూమి ఉందని సీతారాం బంజర మేజర్ కాలువ నుండి మా పొలంకి పంట కాలువ ఉందని, పై భాగంలో ఉన్న రైతులు కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సాగునీరు రావడం లేదని, తమకు కాలువ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం మోతీనగర్ కు చెందిన కే.వెంకట కృష్ణ తమ ఇంటికి మిషన్ భగీరథ పైప్ లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన ఏ. రామారావు తన ఇంటి స్థలంలో 2 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ఇంటినిర్మాణానికి ఆటంకం కల్గుతున్నందున ఆ స్తంభాలు తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ టిజి ఎన్పిడిసిఎల్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు.విద్యార్థులు కలెక్టర్ కు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు.

## ఘనంగా యువజన నాయకురాలు శ్రావ్య రెడ్డి జన్మదిన వేడుకలు..




సూర్యాపేట జూన్ 15:(విజన్ ఆంధ్ర) : వైట్ హౌస్ లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య సమక్షంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంలాంటిందని,మహిళల సాధికారత కాంగ్రెసతోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. యువతకు ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ నాగుల వాసు, వల్దాస్ శ్రీను, అబ్దుల్ రహీం, పిడమర్తి డిఆర్, బొజ్జ నిరన్,అయ్యన్న,సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రిని కలిసిన మాజీ కార్పొరేషన్ అధ్యక్షురాలు.



బాన్సువాడ జూన్ 15 (విజన్ ఆంధ్ర) కేంద్ర మాజీ మంత్రిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేషన్ మహిళ అధ్యక్షురా లు. కేంద్ర మాజీ మంత్రి వర్యులు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ని మర్యాద పూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ అధ్యక్షురాలు శ్రీమతి అట్లూరి రమాదేవి, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, కామారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షులు కమ్మ సత్యనారాయణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. చాలా సంవత్సరాల తర్వాత రేణుక చౌదరిని కలవడం సంతోషంగా ఉందని మాజీ మంత్రి యోగక్షమాలను వారు అడిగి తెలుసుకున్నారు.

# వనాలు.. పర్యావరణ పరిరక్షణకు వరాలు

**- మొక్కలు నాటడం సామాజిక బాధ్యత**

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : వనాలు పర్యావరణ పరిరక్షణకు వరాలు అని మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకొని ఈనెల 18వ తారీఖు నుండి వన మహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆస్తి పన్ను వసూలలో కలెక్టరేట్ కార్యాలయ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అధికారులను ఆదేశించారు . సోమవారం ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో వనమహోత్సవ కార్యక్రమం, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూలు , ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత సంబంధిత విషయాల పై అదనపు కలెక్టర్ నగేష్ , డీఎఫ్ఓ జో.జి డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ భాగస్వామ్యం ద్వారా విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఈనెల 18 నుండి వన మహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వక్కువల్ గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో మన జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. అటవీ శాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మున్సిపల్ శాఖ, వివిధ సంక్షేమ శాఖలు వ్యవసాయ, విద్యా, తదితర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 31.95 లక్షల మొక్కలను నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నగర్ వన్ యోజన పార్కులో ఈనెల 18న వన మహోత్సవ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని పరిరక్షించాలని లికలెక్టర్‌లి పిలుపునిచ్చారు. జిల్లాను మరింత పచ్చదనంతో నింపేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ శాఖల వారీగా రివ్యూ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆస్తి పన్ను వసూలలో భాగంగా కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత డిఆర్ఓ ను ఆదేశించారు. కలెక్టరేట్ లోని వివిధ విభాగాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని కార్యాలయాలు కలెక్టర్ ఆకస్మిక పర్యటనలలో అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయాల అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్.

బాన్సువాడ జూన్ 15 (విజన్ ఆంధ్ర). ఐదుగురు పేకాట రైళ్లు అరెస్ట్ అయినట్లు సోమవారం ఏఎస్ఐ గంగారం తెలిపారు. నసురుల్లాబాద్ మండల పరిధిలోని సంగెమ్ గ్రామం లో పేకాట స్థావరం పై పోలీసు లు దాడి చేసి ఐదుగురి ని పట్టు కోవడం జరిగింది. వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు 3090/- రూపాయలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి వారిని రిమాండ్ కు తరలించినట్లు ఏ ఎస్ ఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండల పరిధిలో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు ఆచూకీ తెలిస్తే వారు పోలీసులకు నేరుగా సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# రాయిన్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులు వెంటనే చేయాలి

**- రైతులకు సాగునీరు అందించండి..**

**- రాయిన్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులపై బీఆర్ఎస్ ఆందోళన.**

**- రాయిన్‌పల్లి హై లెవల్ కాల్వ థోని పునరుద్ధరణకు డిమాండ్.**

**- 2,500 ఎకరాల సాగుకు జీవనాడి..**

**- కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ ధర్నా..**

**- అజి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి**





విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ దెబ్బతిన్న థోనికి తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు సోమవారం మెదక్ కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా మెదక్ మండలంలోని రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ థోని కొట్టుకుపోయిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. థోని దెబ్బతిని సంవత్సరం గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిం చారు. రాయిన్ పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ థోనికి తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశా రు. రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ ద్వారా తిమ్మానగర్,మక్తా భూపతిపూర్, గుట్టకింది పల్లి, శివాయిపల్లి, మల్కాపూర్ తండా,వెంకటాపూర్, కొంటూర్ గ్రామాల రైతులు ప్రత్యక్షం గా, పరోక్షంగా ఆధారపడి వ్యవసా యం సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ కాల్వ ద్వారా మెదక్ పట్టణ పరిధిలోని గోసముద్రం, పిట్లంబేస్, బంగ్లా చెరువులు కూడా నిండుతాయని వివరించారు. రాయిన్ పల్లి ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బట్టి. జగపతి,కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజగౌడ్,మాజీ ఎంపీపీ కిష్టయ్య,మాజీ వైస్ ఎంపీపీ,మార్గం. ఆంజనేయులు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, ఆర్.కే. శ్రీనివాస్, బీమరి కిషోర్, బీఆర్ఎస్ నాయకులు ఇందాద్ , ఎలక్షన్ రెడ్డి, బాలయ్య, గట్టయ్య, సిద్దిరాములు, చంద్రపాల్, యంబీపూర్. మహేష్, గంగయ్య, సత్య గౌడ్, రవి,శ్రీనివాస్ గౌడ్,మల్లేశం,మోహన్ నాయక్, శ్రీనివాస్, మేకల సాయిలు ,చెన్న గౌడ్ ,యామిరెడ్డి ,సాయ గౌడ్ ,రాజేశ్వరరావు, సాప సాయిలు ,రామచంద్ర రెడ్డి ,నరేందర్ రెడ్డి, శ్రీను నాయక్, శ్రీనివాస్, జగన్ గురుమూర్తి గౌడ్, బద్రి. మల్లేశం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ ,పడాల శ్రీనివాస్ , ప్రభాకర్ ,స్వామి ,లక్ష్మణ్ ,వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో ఫీజు రాయితీ కల్పించండి

**- వికారాబాద్ జిల్లా డీఈఓకు టిడబ్ల్యూజేఎఫ్ వినతి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరి పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రామచందర్, జిల్లా కార్యదర్శి షఫీ లు అన్నారు, సోమవారం వికారాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో డిఇఓ అబ్దుల్ ఘనికి ఫీజు రాయితీ విషయమై వినతి పత్రం అందించారు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఇందుకు సంబంధించిన వివరాలను డి ఈ ఓ కు వివరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లా పరిధిలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చేలా తగు సూచనలతో ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిఇఓ వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల విజ్ఞప్తికి సానుకూల నిర్ణయం పట్ల టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భీంశప్ప, మురళీమోహన్ గుప్తా, ఆనంద్, జిల్లా సహాయ కార్యదర్శి చేన్ బసప్ప, హఫీజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

**- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ఐపీఎస్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వాటిపై సమగ్రంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ వివాదాలు, మోసాలు, వేధింపులు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, బాధితులకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, ప్రతి వినతిదారునికి ఫిర్యాదు పురోగతిపై సమాచారం అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన వ్యవస్థను అమలు చేయడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

# అడ్డదారిలో అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

***ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి***



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గద్దెరగడి సమీపంలో గల కాకతీయ పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని, పాఠశాల భవనం లీజ్ అగ్రిమెంట్ కంటే ముందే పాఠశాలకు అన్ని అనుమతులు ఇచ్చిన విద్యా శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు ఫిర్యాదు చేశారు. కాకతీయ పాఠశాలకు సంబంధించిన ఫైర్,మున్సిపల్,సానెటరీ,సౌండ్,ట్రాఫిక్ తదితర ఎన్ వో సి లు జారీ చేశారని, అంతే కాకుండా ఇచ్చిన ప్రతి ఎన్ వో సి సర్టిఫికెట్ల లో ఎక్కడ కూడా పాఠశాలకు భవనానికి సంబంధించిన చిరునామా లేకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు.అంతే కాకుండా పాఠశాల భవనం నేషనల్ హైవేకి ఆనుకొని ఉండటం జరిగిందని, ఈ రోడ్ మార్గంలో అనునిత్యం పెద్ద పెద్ద వాహనాలు నడుస్తాయని, విద్యార్థులు సడెన్ గా పాఠశాల నుంచి బయటికి వస్తే విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని అన్నారు, పాఠశాల అనుమతి కోసం దరఖాస్తు చేసిన సమయం లో అన్ని పత్రాలు క్షుణ్ణంగా పరిశించాల్సిన అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించి పరిమిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు.వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మరియు తప్పుడు పత్రాలను చూపి అనుమతులు పొందిన యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని, అంతే కాకుండా పాఠశాలను సీజ్ చేయాలని ఫిర్యాదులో కోరారు.

# "మధ్యతరగతి మందహాసం" ద్వితీయ ముద్రణ పుస్తకం ఆవిష్కరణ



హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రఖ్యాత రచయిత దివంగత బెహరా వెంకట సుబ్బారావు రచనల సంకలనం "మధ్యతరగతి మందహాసం" ద్వితీయ ముద్రణ పుస్తకం ఆవిష్కరణ సభ తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎమెస్కో పబ్లిషర్స్ ఆధ్వర్యంలో బెహరా వెంకట సుబ్బారావు కుమారుడు బెహరా సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో రవీంద్రభారతి, మొదటి అంతస్తు, సమావేశ మందిరం, సైఫాబాద్, హైదరాబాద్ లో ఆదివారంనాడు సాయంత్రం సాహితీ అభిమానులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ "మధ్యతరగతి మందహాసం" ద్వితీయ ముద్రణ పుస్తకం ఆవిష్కరణ సభకు అధ్యక్షత సీనియర్ పాత్రికేయులు గుండు వల్లీశ్వర్ వహించి ప్రసంగిస్తూ, బెహరా వెంకట సుబ్బారావు కథలలో నిగూఢమైన విషయం నిక్షిప్తమై ఉందని అది మధ్యతరగతి మన మనుషుల మనస్తత్వాలతో పెనవేసుకు పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్రకారుడు 'బ్నిం' హాజరై సంకలనం ద్వితీయ ముద్రణను ఆవిష్కరించి మాట్లాడుతూ, బెహరా వెంకట సుబ్బారావు ఏ లోకంలో ఉన్నా ఎంతో సంతృప్తిగా ఉంటారని, ఆయన కథలను ఈ తరానికి అందించిన వారి అబ్బాయి బెహరా సత్యనారాయణ మూర్తి తండ్రి పేరు నిలబెడుతున్న ధన్యుడని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రముఖ హాస్య నటుడు సాహితీవేత్త డాక్టర్. గుండు సుదర్శన్ మాట్లాడుతూ, ఈ సమావేశం పండగ వాతావరణాన్ని తలపిస్తున్నదని చెబుతూ బెహరా వెంకట సుబ్బారావు కథలు



ఊట బావిలాంటివని, హాస్య చతురతను పండించేవిగా ఉంటాయని కొనియాడారు. కొన్ని కథలను ఉదాహరిస్తూ సభను నవ్వులలో ముంచెత్తి హాస్య భరితమైన ప్రసంగం చేశారు.ఈ కార్యక్రమానికి ఆత్మీయఅతిథులుగా డా. చిల్లర భవాని దేవి హాజరై మాట్లాడుతూ, సుబ్బారావు కథల్లో స్త్రీల మనస్తత్వాలను చక్కగా చిత్రీకరిస్థారని తెలిపారు.సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ విచ్చేసిన ప్రసంగిస్తూ, సుబ్బారావు ఒక పోస్ట్ మాస్టర్ గా తనకి సామాన్య జనంతో ఉన్న సంబంధాల్ని ఆధారంగా చేసుకుని గొప్ప కథల్ని రచించారని అవి జీవితకాలం నిలబడడమే కాక ముందు తరాల వారు కూడా చదివేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. కల్లూరి సోమ శంకర్ కథలపై సమీక్ష చేస్తూ సునిశితమైన హాస్యాన్ని కథలలో జోడిస్తూ తను చెప్పవలసిన విషయాన్ని సున్నితంగా చెబుతూ ప్రతి కథకి గొప్ప కొసమెరుపులు ఇచ్చారని అన్నారు. కలిగోట్ల సన్యాసి రాజు మాట్లాడుతూ, బెహరా వెంకట సుబ్బారావుతో ఉన్న తన అనుబంధాన్ని, సాహిత్యాన్ని సభ్యులకు పరిచయం చేశారు. "మధ్యతరగతి మందహాసం" పుస్తకం సంపాదకుడు బెహరా వెంకట సుబ్బారావు కుమారుడు 'బెహరా సత్యనారాయణ మూర్తి' ఈ సందర్భంగా స్పందిస్తూ, నాన్నగారి కథలు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సామాజిక చైతన్యానికి దోహదపడ్డాయని, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలలో ఉన్న నిజాయితీని నైతిక విలువలను వారి కథలు ప్రతిబింబిస్థాయని పేర్కొన్నారు. ఎంతో అభిమానంతో సభకు హాజరైన అందరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

# పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- తుంబూరు దయాకర్ రెడ్డి**



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా, వంద శాతం పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.16,64,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయి కూడా పక్కదారి పట్టకుండా, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తూ నేరుగా లబ్ధిదారుల చేతులకే ఈ ఆర్థిక సాయం అందేలా చూస్తున్నామని వివరించారు. కార్పొరేట్ వైద్య భారాన్ని మోయలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఈ సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఆధ్యాత్మిక సందడి

**- రాజన్న దర్శనానికి వచ్చిన ప్రభుత్వ ప్రముఖులు**






వేములవాడ, జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పలువురు ప్రభుత్వ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, తెలంగాణ ప్రభుత్వం ప్రోటోకాల్ మరియు పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కర వేణుగోపాలరావు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు అర్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యం, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వేద పండితులు వారికి వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి అతిథులను శేషవస్త్రం, లడ్డు ప్రసాదంతో సత్కరించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, వేములవాడ ఆర్డీవో కుమారి, ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎల్పీఎల్ గ్లోబల్ సంస్థకు పెట్టుబడుల మద్దతు

హైదరాబాద్, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : లంక ప్రీమియర్ లీగ్(ఎల్ పీఎల్) ప్రమోటర్ సంస్థ ఐపీజీ(ఇన్నోవేటివ్ ప్రొడక్షన్ గ్రూప్ ఎఫ్ జెడ్ ఎల్ఎల్ సీ) అమెరికాకు చెందిన నాస్‌డాక్‌లో నమోదైన సంస్థతో వ్యూహాత్మక విలీనాన్ని పూర్తి చేసి కోట్లాది డాలర్ల నిధుల మద్దతు పొందినట్లు ఐపీజీ గ్లోబల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ మోహన్ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లాష్ స్పోర్ట్స్, మీడియా సీఈఓ బ్రాడ్లీ నాట్రాస్, సంస్థ సీఫ్ఓ ఎరిక్ షెర్బ్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఫ్లాష్ స్పోర్ట్స్, మీడియా ఇంక్‌తో జరిగిన ఆల్–స్టాక్ విలీనం ద్వారా ఎల్పీఎల్‌తో పాటు ఇతర టి20 లీగ్‌ల వాణిజ్య హక్కులు నాస్ డాక్ లో నమోదైన యూజీఆర్ వో ప్లాట్‌ఫామ్‌లోకి చేరాయని తెలిపారు. రాబోయే రెండేళ్లలో ఎల్పీఎల్ అభివృద్ధికి 20 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడి ఎల్పీఎల్ వృద్ధికి కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ విలీనం పలు క్రికెట్ మార్కెట్లలో కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వాణిజ్యాభివృద్ధి, స్థిరమైన ఆదాయ మార్గాల నిర్మాణంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఎల్ పీఎల్ ఆరో సీజన్ జూలై 10న ప్రారంభం కానుందని తెలిపారు.

# పాఠశాలలో ప్రీ - ప్రైమరీ ఉద్యోగాలకు దరఖాస్తులు

భూపాలపల్లి జిల్లా 15 జూన్ (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందు ఈ క్రింద తెలిపిన పాఠశాలలో కొత్తగా మంజూరు కాబడిన ప్రీ - ప్రైమరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇన్స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి స్థానిక అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తూ మొత్తం విద్యా సంవత్సరం 2026–27 కు గాను 10 నెలల తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి యం. రాజేందర్ తెలియజేశారు. మండలాల వారీగా పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు.



| క్రమ సంఖ్య | మండలం పేరు | Instructors | Ayas |
|---|---|---|---|
| 1 | Bhupalpally | 3 | 3 |
| 2 | Chityal | 4 | 4 |
| 3 | Ghanpur(M) | 4 | 4 |
| 4 | Kataram | 5 | 5 |
| 5 | Kothapally Gori | 2 | 2 |
| 6 | Mahadevpur | 4 | 4 |
| 7 | Mahamutharam | 4 | 4 |
| 8 | Malhar Rao | 7 | 7 |
| 9 | Mogullapally | 6 | 6 |
| 10 | Regonda | 2 | 2 |

అర్హతలు :- ప్రీ–ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ :

ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి, లేదా ప్రీ ప్రైమరీ డిప్లమా లేదా ప్రీ ప్రైమరీ ట్రైనింగ్ చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. గౌరవ వేతనం రు. 8,000/-– ఆయాలకు –7వ తరగతి ఉత్తీర్ణులై మార్కుల జాబితా జతచేయాలి.గౌరవ వేతనం రు. 6,000/– వయస్సు 18 సం. నుండి 44 సశీ .లోపు ఉండాలి(5 సశీ. ప్రభుత్వ విధానాల ప్రకారం ఎస్సి/ ఎస్టి/బిసి/ ఇడబ్ల్యుఎస్/ 3 సం. రిటైర్డ్ ఆర్మీ మరియు 10 సం. దివ్యాంగ అభ్యర్థులకు మినహాయింపు కలదు)– స్థానికులకు (ఆవాస ప్రాంతం/గ్రామ పంచాయితి/మండలం) మొదటి ప్రాధాన్యత ఉంటుంది.అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు తేది: 16.06.2026 నుండి 19.06.2026 సాయంత్రం–4 గశీ.ల వరకు సంబంధిత మండల విద్యాధికారులకు ధరఖాస్తు చేసుకోగలరు. ధరఖాస్తు పత్రాలు మరియు –ఇతర వివరాల కొరకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి నుండి పొందగలరు.

# పేటలో సంపర్క్ అభియాన్ నిర్వహించిన నామాజీ



నారాయణపేట,జూన్ 15( విజన్ ఆంధ్ర) : ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ సుపరిపాలనకు 12 యేండ్ల పుర్తి చెసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపుమెరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో సమాజ ప్రతిష్ఠిత వ్యక్తుల సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భగంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలోపాల్గొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రం లో శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద పురోహిత్ తండ్రి జనసంఘ్ సభ్యులు, రామభక్తులు యజ్ఞ నారాయణపురోహిత్,ఎస్ఎస్ఎస్ సమాజ అధ్యక్షుడు దేవదత్ డగే పలువురు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ప్రధాని నరేంద్ర మోదీ విక్సిత్ భారత్ గురించి, కేంద్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని రాష్ట్రాలు సమానమనీ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే నినాదంతో దేశాన్ని ముందుకుతీసుకెళుతున్నారని అన్నారు.దేశ హితం కోసం దేశాన్ని విశ్వ గురుగా నిలబెట్టేందుకు ప్రధాని మోదీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సత్య రఘుపాల్ మిడియా కన్వినార్ కిరణ్ పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15, విజన్ ఆంధ్ర : ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షను జిల్లాలో పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ పరీక్షలు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల– కళాశాల లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, 353 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 11 గంటలకు నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని, 1.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థులు 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, అడ్మిట్ కార్డు, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోను అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు సరిపడా కుర్చీలు, టేబుళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అవసరమైన మందు లతో శిబిరం ఏర్పాటు చేయాలని, ఆర్ టి సి అధికారులు సమయానుకూలంగా బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష విధులు నిర్వహించే సిబ్బంది తప్ప ఇతరులకు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని, పరీక్షను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీట్ పరీక్షల సిట్ సమన్వయకర్త నరసింహస్వామి, పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు, విద్య, వైద్య, విద్యుత్, ఆర్ టి సి, రవాణా, అగ్నిమాపక, శాఖల అధికారులు, తహసిల్దార్ రియాజ్ అలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీటీఎన్ఎస్ 2.0 అమలు కేసుల వివరాలు సకాలంలో ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలి

**- వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**



కొత్తగూడెం బ్యూరో జూన్ 16(విజన్ ఆంధ్ర) : జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ 2.0 పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని నిర్దేశిత గడువులోగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచి, నివాస ప్రాంతాలు మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రోత్సహించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ కారణంగా జరిగే ప్రమాదాల నివారణకు నిరంతర వాహన తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ల రద్దుకై ఉద్యమించాలి

**-దఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి శింగు**




ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై దేశ వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో శింగు నర్సింహారావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులను కోల్పోతున్నారన్నారు. నూతన లేబర్ కోడ్ల ఆధారంగా యాజమాన్యాలు కార్మికులపై పని భారం ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పెంచారని ఆయన తెలిపారు. సంఘ హక్కును, సమ్మె హక్కును నిరాకరించి, కనీస వేతనాలు, అదనపు పనికి అదనపు వేతనం చెల్లించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలతో పెరగని వేతనాలతో కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. కార్మిక శాఖ అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు యథేచ్ఛగా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. కార్మికుల సంఖ్యను తగ్గించి పని భారాన్ని పెంచుతున్నారని తెలిపారు. దీనితో కార్మికులు తీవ్రమైన అలసట, అసమ్మతికి గురవుతున్నారన్నారు. దాని ఫలితంగానే ఇటీవల ఢిల్లీ పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని వేలాది మంది కార్మికులు ఆకస్మిక సమ్మెకు దిగారన్నారు. పాలకులు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా –అక్రమంగా కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. ప్రభుత్వ బాధ్యతారహిత చర్యలను ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇటీవల హైదరాబాద్ కెమికల్ ఫ్యాక్టరీ, విశాఖ స్టీల్ ప్లాంట్లలో సంభవించిన ప్రమాదాలు, కార్మికుల మరణాలు నాలుగు లేబర్ కోడ్ల దుష్ఫలితం, ప్రైవేటీకరణ విధానం వల్లనే జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయమని కేంద్రానికి తెలియజేయాలని, శతాబ్దాల కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. డాక్టర్ ఆక్టాయిడ్ ఫార్ములాకు అనుగుణంగా కనీస వేతనాలు ప్రకటించాలని శింగు నర్సింహారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15,(విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ మొదటి జాబితాలో వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ ఎస్.సి. కులానికి చెందిన నిరుపేద అయిన తనకు జీవనాధారంగా ఆటో, రెండు పడక గదుల ఇల్లు అందజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచం లు గ్రామ శివారులో చేపట్టిన అక్రమ కల్వర్టు నిర్మాణంలో తమ భూమి ఆక్రమణ జరుగుతుందని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ కు చెందిన సత్యనారాయణ రావు తనకు జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో గల భూమి గోదావరి నీటిలో మునిగిందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని దేవాపూర్ కు చెందిన కాంపేలి వెంకటేశం తన కుమారుడికి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కళ్యాణి తనకు గృహజ్యోతి, గ్యాస్ రాయితీ పథకాలు వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 15.. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి , ఆర్డీవో షర్మిల, కలెక్టరేట్ ఏవో సుధాకర్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 256 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 142,కరీంనగర్ నగరపాలిక సంస్థకు 60 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ శాఖ, విద్యా శాఖల అధికారులతో మొదటి విడత రివ్యూ మీటింగ్ నిర్వహించామన్నారు. బుధవారం నిర్వహించే రెండో విడత మీటింగ్ కి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో డీపీఓ, డీఆర్డీఓ అధికారులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ కోర్టు కేసులు, దరఖాస్తులు, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని హాయ్ శాఖల అధికారులను ఆదేశించారు.ఈవారం యాక్షన్ ప్లాన్, తనిఖీ రిపోర్టులను శుక్రవారం సాయంత్రం లోగా సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

# కల్నల్ సంతోష్ బాబు త్యాగం మరువలేనిది..



సూర్యాపేట జూన్ 15:(విజన్ ఆంధ్ర) : అమర జవాన్ కల్నల్ బిక్కుమళ్ల సంతోష్ బాబు త్యాగం మరువలేనిదని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కల్నల్ సంతోష్ బాబు 6వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన సంతోష్ బాబు సేవలు, త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సార్వభౌమత్వం కోసం పోరాడి అమరుడైన కల్నల్ సంతోష్ బాబు వీరత్వం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన త్యాగాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు.ఈ కార్యక్రమంలో సంతోష్ బాబు తల్లిదండ్రులు, భార్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, సంద్రపాటి విజయ్, నాగుల వాసు, రాజేష్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి,లక్షాది, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం

# సామాన్య ప్రజలు నేరుగా పోలీస్ కార్యాలయానికి రావాలి.

**- జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్.**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర):పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 09 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 04, స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగిందన్నారు. నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

# ప్రజావాణికి 133 ఫిర్యాదులు

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన దరకాస్తులను తరితగతిన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. సోమవారము కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన "ప్రజావాణి" కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం,ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 133 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటా చారి,(రెవిన్యూ ), అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ (లోకల్ బాడీస్), అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర


# పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు..

### - వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



సూర్యాపేట జూన్ 15:(విజన్ ఆంధ్ర) : పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పురస్కారాలు ఉపయోగపడతాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక నగదు పురస్కారాలు అందజేశారు. సుగుణ టీచర్ జ్ఞాపకార్థం సజీవ్ మంజుల దంపతులు ప్రథమ బహుమతిగా రూ.1 లక్ష నగదు బహుమతి, షీల్డ్‌ను ఎన్. మేఘనకు అందించారు. రెండో బహుమతిగా నంద్యాల రవీందర్ రెడ్డి రూ.50 వేల నగదు పురస్కారాన్ని వి. శృతికి ప్రదానం చేశారు. మూడో బహుమతిగా కొప్పుల మధుసూదన్ రెడ్డిఅనసూయ జ్ఞాపకార్థం రూ.25 వేల నగదు పురస్కారాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి దీక్షితకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ పొందుతారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, స్థానిక కౌన్సిలర్ వెలుగు వెంకన్న,మోత్రిశెట్టి కోటేశ్వరరావు, కే నరసింహారావు, కేఎల్ఎన్ చారి, టీ నాగేశ్వరరావు, సిహెచ్ శ్యామ్, కే శంకర్, వెంపటి లక్ష్మయ్య, ఉప్పల సత్యనారాయణ, టి రాధాకృష్ణ, జి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రతపై తనిఖీలు చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట జూన్ 15:(విజన్ ఆంధ్ర) : జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**15 రోజులకొకసారి కార్యాచరణ ప్రణాళిక.. ప్రత్యేక నిఘా..**

ప్రతి పదిహేను 15 రోజులకు ఒకసారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందేలా పాలు, పాల ఉత్పత్తుల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యవసర పాలు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు, మరియు సిద్ధం చేసిన ఆహార పదార్థాలపై నిఘా పెంచి, నమూనాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

**జాతీయ రహదారిపై దాడులు**

65వ జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు.

**పాఠశాలలు, అంగన్వాడీల్లో శిక్షణ**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు సైతం ఆహార భద్రతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఆహార వస్తువుల నిల్వ, భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమాజానికి హానికరమైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా మరియు అమ్మకాలపై ఆహార భద్రత, పోలీస్, మరియు ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరి**

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం జిల్లాలోని చిన్న, పెద్ద ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. వినియోగదారుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే గూగుల్ ప్లే స్టోర్ లోని ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా గానీ, లేదా జిల్లా ఆహార భద్రతా కార్యాలయం 9133291926, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం 08684-222666, రాష్ట్ర ఆహార భద్రతా హెల్ప్‌లైన్ 9100105795, 040-21111111 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్వో వెంకటరమణ, డిటిడిఓ శంకర్, ఎస్సి డిడి దయానందరానణి, డిఐఓ మాలతి కోటి రత్నం డిడబ్ల్యూఓ, నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్నల్ సంతోష్ బాబుకు ఘన నివాళులు అర్పించిన గాదె రుక్మారెడ్డి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 (విజన్ ఆంధ్ర): నాలుగేండ్ల కింద దేశ ఉత్తర సరిహద్దుల్లో చైనాతో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన మన తెలుగువాడు కల్నల్ సంతోష్ బాబుకు గాదె రుక్మారెడ్డి పాఠశాల బృందం ఘనంగా నివాళులు అర్పించింది. సోమవారం నాడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాదె రుక్మారెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ కమ్మగాని కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కల్నల్ సంతోష్ బాబు వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం శంతన్ రామరాజు మాట్లాడుతూ చైనా రాజ్య విస్తరణ కాంక్షతో ప్రపంచ పోలీసు పాత్ర పోషించాలనే దుర్బుద్ధితో తన ధ్వంస జ్ఞానం, తనదగ్గరున్న మదమెక్కిన మిల్ట్రీ బలంతో ఇరుగుపొరుగు దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. అందులో భాగంగానే అరేండ్ల కింద ఇదే రోజున లడక్ ప్రాంతంలోని గల్వాన్ లోయలో పహారా కాస్తున్న మన దేశ సైనికుల మీద హఠాత్తుగా ఈటెలు, కత్తులు, ఇనుప రాడ్లు, లోహపు ముండ్ల లాంటి మారణాయుధాలతో దాడి చేసి చైనా తన ఆటవిక ప్రవృత్తిని చాటుకొందన్నారు. ఈఘటనలో ఇరవై మంది భారత సైనికులు చనిపోవడం అత్యంత బాధాకర విషయమని అన్నారు. భారతమాత స్వేచ్ఛకోసం అసువులు బాసిన సైనికులకు దేశం యావత్తూ ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. ఈదేశంలో ప్రతి పౌరుడూ సైనికుల త్యాగాలని గుర్తు చేసుకోవాలన్నారు. సైనికుల త్యాగాలు లేనిదే మనకు స్వేచ్ఛ లేదన్నాడు. అయితే దురదృష్టవశాత్తు ఈదేశంలో ఉంటూ తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం సైనికుల త్యాగాలను అపహాస్యం చేస్తూ శత్రువును ప్రేమించే కొంతమంది నేతలు, మేధావులు ఇకనైనా బుద్ధి తెచ్చుకొని వాస్తవాస్తవాలను గ్రహించి దేశ ఉన్నతి కోసం ఐక్యతలో ముందుకెళ్లాలన్నారు. యువతలో దేశభక్తి, జాతీయభావం పెంపొందే విధంగా తమ ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. ఏదేమైనా దేశం మీద జరిగే తన తల్లిమీద జరిగినట్లే అనే భావనతో ఇలాంటి దాడులను ప్రతి భారతీయుడు వ్యతిరేకించాలన్నారు. 16వ. బీహార్ రెజిమెంట్ కు కమాండింగ్ అధికారి అయిన కల్నల్ సంతోష్ బాబు భౌతికంగా మనమధ్య లేకపోయినా అతని ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఇలాంటి వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పెట్టినట్లైతే విద్యార్థుల్లో దేశభక్తి, వృత్తిపట్ల అంకితభావం, క్రమశిక్షణ అలవర్చుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఫెడరేషన్ లీడర్ పోలెపాక వెంకన్న, పాఠశాల సిబ్బంది హరి ప్రసాద్, స్వామి, వీరన్న, రఘు, రాధిక, వసీమ, జ్యోత్స్న, సరస్వతి, సుధారాణి, ప్రభావతి, రేణుక, మౌనిక, శిరీష, ఉమామ, వెన్నెల, శ్వేత, అర్పిత, పూజిత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం రోడెక్కిన పార్టీలు

### - కోటకొండ నుంచి పేట వరకు పాదయాత్ర



నారాయణపేట, జూన్ 15 ( విజన్ ఆంధ్ర) : అప్పక్ పల్లి –కోటకొండ –కోయిలకొండ మధ్యన అసంపూర్తిగా మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్,సిపిఎం,బీఎస్పీ,టి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కోటకొండ నుంచి నారాయణపేట వర కు పాదయాత్ర నిర్వహించా రు. ఈ పాదయాత్ర కోటకొండ సెంటర్ లోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ప్రారంభ సభకు మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శ కె.కాశీనాథ్ అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం హన్మేష్ మాట్లాడుతూ. ఈ రోడ్డును పూర్తి చేయడంలో ప్రభుత్వంగా నిర్లక్ష్యం వహి స్తునందన్నారు. ఐదు సంవ త్సరాల క్రితం ప్రారంభించిన రోడ్డు ప్రభుత్వం మారిపోయి కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదనీ అన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే జవాబు చెప్పాల్సి న అవసరం ఉంది అన్నారు. రోడ్డు అసంపూర్తిగా మిగిలి పోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు చదువులు కొనసాగించడం ఇబ్బందిగా ఉందనీ అన్నారు ఇక్కడ నుంచి మహబూబ్నగర్, నారాయణ పేట వెల్లె వ్యాపా రస్తులైన, విద్యార్థులైన వేరే ఉపాధి వెతుక్కునే యువకు లైన ఉద్యోగస్తులకైన చాలా ఇబ్బందిగా మారింది అన్నా రు ఆర్టీసీ వాళ్లు బస్సు నడ పాలి అంటే ఈ ప్రాంతం నుండి వచ్చే ఆదాయం కంటే బస్సు రిపేర్ కి ఎక్కువ ఖర్చు అవుతున్నది అందుకే బస్సు లు నడపడం లేదని అంటు న్నారు. ఏ ప్రాంతమైన అభి వృద్ధి చెందాలంటే ఆ ప్రాంతం లో రవాణా సౌకర్యాలు నీళ్లు ముఖ్యమైనవి కానీ ఇవి కల్పించడంలో గత ప్రభు త్వాలు నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయనీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్ని కల్లో అన్ని పార్టీలు రోడ్డు పూర్తి చేస్తామని హామీలు ఇచ్చాయి హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా కూడా వాటిని పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అయినా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ఎంపీ డీకే అరుణ అయినా ఈ రోడ్డుని పూర్తిచేసే అవకాశం ఉన్నది కానీ వాళ్లు నిర్లక్ష్యం గా ఉంటూ ప్రజలపై రాజకీ యాలు చేస్తున్నారనీ అన్నా రు. వాళ్లు చిత్తశుద్ధితో వెంట నే రోడ్డు పూర్తి చేసి ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. లేనిచో ఈ ప్రాంతం లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. అనంతరం జిల్లా కలె క్టర్ కు వినతి పత్రం సమర్పిం చారు. ఈ పాదయాత్రలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ వీరన్న, జిల్లా అధ్యక్షులు కృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొడిగల శ్రీనివాస్, మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. కోటకొండా మాజీ ఎంపీటీసీ లు సునీత, సరళ, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు జయ, బోయిన్ పల్లి రాము, యాదగిరి, బి.నరసింహ పి.రామకృష్ణ, కొండ నరసిములు, చెన్నారెడ్డి, డివిజన్ నాయకులు హాజీ, ఎదిరింటి నర్సింలు, ప్రతాప్, వెంకట్రములు, అంజి, బాలకృష్ణ, ప్రశాంత్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం

### - ప్రజావాణిలో వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అంకిత్
### - శాఖల సమన్వయంతో వేగవంత పరిష్కారాలకు ఆదేశాలు



కొత్తగూడెం బ్యూరో జూన్ 16(విజన్ ఆంధ్ర) : ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. శాఖల మధ్య సమన్వయం పెరిగితే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15, విజన్ ఆంధ్ర : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ రెడ్డి భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన చంద్రి మడిరాం తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం నవేగాం గ్రామానికి చెందిన మహాత్మ శకుంతల తనకు రైతు బీమా డబ్బులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణం పోచమ్మ బస్తీకి చెందిన బత్తుల రాజేశ్వర్ దివ్యాంగుడు అయిన ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కెల్లూరి దుర్గా గౌడ్ తనకు ప్రభుత్వం ఇచ్చిన లావుని పట్టా భూమిని అటవీ శాఖ వారు అడ్డుపడుతున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహేగం మండలం ఐనం గ్రామ సర్పంచ్ ఎల్ములే ప్రశాంత్ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నందున సరి చయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం కైరుగాం పంచాయతీ పరిధిలో ఎడవెల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు వట్టివాగునీరు అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం బాలేపల్లి కి చెందిన లడే సాయి ప్రసాద్ తనకు 8వ తరగతిలో గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహేగాం మండలం కోతిమీర్ గ్రామానికి చెందిన రెడ్డి రాజయ్య తనకు బ్యాంకు నుండి రుణం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## డీఈవో ను సన్మానించిన పిఆర్టియు నాయకులు



నారాయణపేట , జూన్ 15 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని డిఈఓ కార్యాలయంలో సోమవారం డీఈఓ గోవిందరాజులు జన్మదినం సందర్భంగా ఆయనకు శాలువా పూలమాలలతో సత్కరించి మిఠాయిలను పిఆర్టియు జిల్లా అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి లతోపాటు ఉపాధ్యాయులు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిఆర్టియు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ఏర్పాటు అయిన తర్వాత డిఇఓగా గోవిందరాజులు బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఎంతో మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. అంతే కాకుండా గత పదవ తరగతి పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరచడం జరిగిందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేస్తామని ఆయన డిఈఓ కు కోరారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ టి యు కార్యదర్శి పి.వెంకట్ రెడ్డి,గౌరవ అధ్యక్షులు తిరుపతి, డీఈఓ కార్యాలయ ఏ ఎం ఓ విద్యాసాగర్, సెక్టోరియాల్ అధికారి నాగార్జున రెడ్డి , మండల విద్యాధి కారులు ఆర్ ఆంజనేయులు, జనార్దన్ రెడ్డి, జి సి డి ఓ సంగీత, పి ఆర్ టి యు నారాయణపేట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుఎం.రఘువీర్,ఎం జనార్ధన్, ఉట్కూర్ మండలం ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి,నరేష్ ,అరవింద్, అశోక్, వెంకటప్ప, గోపాలకృష్ణ, జహీరోద్దీన్, మల్లేశం కార్యాలయం సిబ్బంది ఉదయ భాను, శ్రీకాంత్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ నుంచి ప్రైవేటు భూములకు మోక్షం కల్పించండి

### - సర్వే నెంబర్‌లోని మొత్తం విస్తీర్ణం.. నిషేధిత జాబితాలో పెట్టడం అభ్యంతరం
### - రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాను సవరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు బిల్డర్ల వినతి
### -సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మను చౌదరి
### - త్వరలోనే సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరిస్తామని హామీ



బోడుప్పల్, జూన్ 15 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఉప్పల్, నారపల్లి, ఘట్‌కేసర్ సబ్-రిజిస్ట్రార్ పరిధిలో ప్రైవేటు భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బిల్డర్లు, రియల్టర్లు, ప్లాట్ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏవీ కన్స్ట్రక్షన్స్ ఎండీ, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. కొన్ని సర్వే నంబర్లలో స్వల్ప విస్తీర్ణం మాత్రమే ప్రభుత్వ భూమిగా ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబర్లను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిపల్లి, పర్వతాపూర్, పోచారం, చెంగిచెర్ల, సాలార్‌జంగ్ కంచా, పీర్జాదిగూడ ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులతో అభివృద్ధి చేసిన లేఅవుట్లు, నివాస కాలనీలు, ప్లాట్లు కూడా నిషేధిత జాబితాలో ఉండటంతో వేలాది మంది ప్లాట్ యజమానులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 22-ఏ జాబితాను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి, ప్రభుత్వ భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచి, ప్రైవేటు పట్టా భూములను విడుదల చేయాలని కోరారు. వక్ఫ్ బోర్డు జాబితాలో చేరిన కొన్ని సర్వే నంబర్లను కూడా పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై బిల్డర్లతో జిల్లా కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించి, సంబంధిత సబ్-రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామ సతీష్ రెడ్డి, బిల్డర్లు రమేష్, జనార్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజేష్ రెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, అరుణ్, నర్సింహ్మారెడ్డి, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, మునికుంట కిరణ్ గౌడ్, అశోక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### - జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం అని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీతోనేటర్ పేలడంతో చేతికి తీవ్ర గాయాలు



భూపాలపల్లి జిల్లా జూన్ 15 (విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి కేటీకే 5 గనిలో ఫ్రీ షిఫ్ట్ లో శ్రీరాముల ప్రదీప్ (35)అనే కార్మికుడు విధులు నిర్వహిస్తున్న సమయంలో లో డిటోనేటర్ బ్లాస్ట్ అయి డిటోనేటర్ పెలడంతో నుజ్జు నుజ్జు అయిన ఎడమ చెయ్యి వేళ్ళు. దీనికి కారణం ఎక్షప్లోజీవ్ బ్లాస్టింగ్ కొత్త సిస్టమ్ రావడంతో ఇంద్ర అనే కంపెనీ కి చెందిన నాణ్యత లోపం గల కంపెనీకి చెందిన ఎక్సప్లోసివ్ బ్లాస్టింగ్ వాడడం వలనే ఈ ప్రమాదం జరిగింది అని కార్మికులు చర్చించుకుంటున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగగకోపోవడం తో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారుల సత్తా



కొత్తగూడెం బ్యూరో జూన్ 16(విజన్ ఆంధ్ర) : హైదరాబాద్‌లోని గౌలిపురాలో ఈ నెల 13, 14 తేదీలలో నిర్వహించిన అండర్-15 రాష్ట్రస్థాయి బాల, బాలికల బాక్సింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో 33 కేజీల విభాగంలో టీ. మణికంఠ రజత పతకం, 70 కేజీల విభాగంలో ఎ. జోనతన్ రజత పతకం, 70+ కేజీల విభాగంలో కె. సోహిత్ చంద్ర రజత పతకం సాధించి జిల్లాకు గౌరవం తీసుకొచ్చారు. బాలికల 40 కేజీల విభాగంలో కె. భావన కాంస్య పతకాన్ని గెలుచుకుని ప్రతిభ చాటింది. రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు సాధించిన విజయాలపై కోచ్ శ్రీనివాస్ మట్టపర్తి హర్షం వ్యక్తం చేశారు. విజేతలను జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి పరంధామ రెడ్డి, మట్టపర్తి రమేష్ అభినందిస్తూ భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సాధించిన ఈ విజయాలు జిల్లాకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**- జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం**

**- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : జాతీయ వైద్య కమిషన్ యోగాను సామర్థ్య-ఆధారిత వైద్య విద్య పాఠ్య ప్రణాళికలో ఒక ముఖ్యమైన అంశంగా చేర్చిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026 జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దీన్‌దయాళ్ బాంగ్ ను కోరుతూ రాష్ట్ర మెడికల్ సెల్ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్య కళాశాలలు ప్రతి సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య నిపుణుల భాగస్వామ్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ఎన్‌ఎంసి నిరంతరం సూచిస్తోందని ఆయన గుర్తు చేశారు. యోగ శిక్షణా తరగతుల నిర్వహణ, ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన కామన్ యోగా ప్రోటోకాల్ అమలు, అలాగే వైద్య విద్యార్థులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బందిలో శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడం వంటి అంశాలకు ఎన్‌ఎంసి మార్గదర్శకాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంబీబీఎస్ విద్యార్థులు, ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపక బృందం, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఆరోగ్య కార్యకర్తల భాగస్వామ్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సముచితంగా నిర్వహించాలని కోరారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

**- ఎస్పీ మహేష్ బి. గితే**

**- బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన**



రాజన్న సిరిసిల్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 24 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో నేరుగా మాట్లాడి, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించడమే గ్రీవెన్స్ డే ప్రధాన ఉద్దేశమన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి వినతులను శ్రద్ధగా విని అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, చట్టం ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. దీంతో ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం, నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. గ్రీవెన్స్ డేలో అందిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారం వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## పెండింగ్ బకాయిలను చెల్లించాకే రాయితీ విధానాన్ని అమలు చేయాలి

**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం పరిశ్రమ సంఘాల లేఖ**

హైదరాబాద్, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం ముందుగా రూ.3,725.73 కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లించిన తర్వాతే ముందస్తు చెల్లింపు రాయితీ(క్యాష్ డిస్కౌంట్) విధానాన్ని అమలు చేయాలని మద్యం పరిశ్రమ సంఘాలు కోరాయి. బ్రేవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బి.ఎ.ఐ), ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఐ.ఎస్.డబ్ల్యూ.ఎ.ఐ), కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్(సీ.ఏ.బీ.సీ) సంయుక్తంగా తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఐ.ఎస్.డబ్ల్యూ.ఎ.ఐ సీఈఓ సంజిత్ పధి, సీ.ఏ.బీ.సీ డైరెక్టర్ జనరల్ అనంత్ అయ్యర్, బీఏఐ డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానం ప్రకారం తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టిజిబిసిఎల్)కు సరఫరా చేసిన ఉత్పత్తుల బిల్లులను 15 రోజుల తర్వాత 2 శాతం నుంచి 2.75 శాతం వరకు క్యాష్ డిస్కౌంట్ మినహాయించి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే 2025 డిసెంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు ఉన్న రూ.3,725.73 కోట్ల బకాయిలు ఇంకా చెల్లించకుండా తాజా సరఫరాలపై ముందస్తు చెల్లింపు రాయితీని అమలు చేయడం వాణిజ్య, అకౌంటింగ్ ప్రమాణాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. చెల్లింపులను కాలక్రమానుసారం విడుదల చేసి పెండింగ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు నమోదు చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వానకాలం సీజన్ కు సంబంధించి ఎరువులు, విత్తనాల విక్రయాలపై క్రమబద్ధీకరణ, నియంత్రణపై కొడంగల్ నియోజకవర్గం వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ...జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. ఎవరైనా డీలర్లు నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్లలో విత్తనాలు, నిషేధిత విత్తనాలు విక్రయించినట్లయితే అలాంటి వారిపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు. జిల్లాలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతు బీమ, రైతు భరోసా తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాల పంపిణీకి సంబంధించి రిజిస్టర్ లో నమోదు చేయాలని అదేవిధంగా రైతుల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులు ఎరువుల, విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధుల, ఇతర శాఖల అధికారులను భాగస్వాములను చేసి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సన్న రకం బియ్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సన్న రకం వరిని సాగుచేసిన వారికి 500 రూపాయలు బోనస్ చెల్లించడం జరుగుతుందని, ఇట్టి విషయంపై రైతుల్లో అవగాహన కల్పించి జిల్లాలో సన్నరకం వరిని సాగు చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# పట్టా భూములపై కబ్జా యత్నం.. మహిళల ఆవేదన

**- సమగ్ర సర్వే చేసి న్యాయం చేయాలని అధికారులకు వినతి**

**- పంటలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపణలు**

**- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన**





నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జూన్ 15 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని మాదారం శివారులోని సర్వే నంబర్ 331/ఇ పరిధిలో ఉన్న తమ పట్టా భూములను పాలి పాటు వారి బంధువులతో వ్యక్తులు అక్రమంగాఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత మహిళలు జ్యోతి, భార్గవి, భారతి ఆరోపించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తాము చట్టబద్ధమైనపట్టాదారులమని, దశాబ్దాలుగా సంబంధిత భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమ భూములపై హక్కులు చెలాయిస్తూ, సాగు చేసిన పంటలను ధ్వంసం చేయడమే కాకుండా అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై ఇప్పటికే జిల్లా సర్వేయర్, మండల సర్వేయర్‌ల ద్వారా పంచనామా నిర్వహించినప్పటికీ ఎలాంటి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. భూములకు సంబంధించి ఓఎస్ నం.08/2025 కోర్టు కేసు కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత పత్రాలు, కోర్టు అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహిళలమనే కారణంతో తమపై ఒత్తిడి తెస్తూ భూముల వద్దకు వెళ్లనీయడం లేదని, అనేకసార్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన స్పందన రాలేదని వాపోయారు. తమ పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి, భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. తమ మామ గ్రామానికి చెందిన అర్జున్ రెడ్డితో కొనుగోలు చేసిన భూమిని తమ భర్తలకు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత తాము తమ హద్దుల పేరుపై కలెక్టర్ ఆదేశాలు ఉన్న పట్టించుకోని ఊరుకొండ ఎమ్మార్వో అక్రమ రిజిస్ట్రేషన్ అజయ్ కుమార్, శివకుమార్ పేరుమీద చేయడం జరిగింది. అయినా కూడా తమ పొలం వద్దకు తమ పాలివారు వారి బంధువులు వచ్చి మేము వేసిన పంటలను కూడా ధ్వంసం చేయడం జరుగుతుంది. వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించి తమకు రక్షణ కల్పించాలని బాధిత మహిళలు విజ్ఞప్తి చేశారు. ఫోటో క్యాప్షన్: మాదారం శివారులోని తమ పట్టా భూములపై జరుగుతున్న వివాదం, పంటల నష్టం గురించి వివరాలు వెల్లడిస్తున్న బాధిత మహిళలు జ్యోతి, భార్గవి, భారతిలు ఆరోపించారు. మాపై దౌర్జన్యంగా నిరుపేద ఒంటరి మహిళలపై మాతృభూమి సంస్థ జాతీయ అధ్యక్షుడు, మహేంద్ర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ప్యారాసాని రమాకాంత్, పిన్నంశెట్టి డెంటల్ డాక్టర్ రాఘవేంద్ర ప్రశాంత్, రిటైర్డ్ టీచర్ నోముల కృష్ణయ్య మహేంద్ర సంఘం జడ్చర్ల టౌన్ అధ్యక్షుడు, మాదారం పిన్నంశెట్టి వెంకటమ్మ తన కుమారులు పిన్నంశెట్టి అజయ్ కుమార్, పిన్నంశెట్టి శివకుమార్, అందరూ కలిసి మా పంటలపై దౌర్జన్యంగా కలుపు మందు కొట్టి పంట నష్టం చేశారు వీరి వల్ల మాకు ప్రాణహాని ఉంది,, ఇది సీసీ ఫ్రైజ్ లో క్లియర్ గా క్లుప్తంగా ఉంది దీనిపై పోలీస్ కంప్లేట్ ఇచ్చినా కూడా పోలీసులు స్పందన లేదు అందుకు దయచేసి సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిధులు విధులు హక్కుల కోసం పోరాడుదాం

**- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి చట్టబద్ధంగా నిధులు రాబడుదాం**

**- సర్పంచుల ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం**

**- వివిధ ప్రభుత్వాల నుండి సర్పంచులకు అనుకూలమైన పనులు**

**- తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ మాజీ అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : వివిధ ప్రభుత్వాల నుంచి సర్పంచులకు అనుకూలమైన జీవోలు కోర్టు తీర్పులు నిధులు సాధించడంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర సర్పంచుల సంఘం కీలకపాత్ర పోషించిందని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ మాజీ అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి చట్టబద్ధంగా న్యాయబద్ధంగా రావలసిన నిధుల కోసం సర్పంచులందరం కలిసికట్టుగా పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల అనంతగిరి గుట్టలో హరితరిసార్ట్ లో ఏర్పాటు చేసిన సర్పంచుల చైతన్య సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటిని నెరవేర్చడానికి నిధులు రాబడుదామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీకి రావలసిన నిధులు, విధులు హక్కుల కోసం సంఘటితంగా పోరాడి సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. సర్పంచుల సమస్యలను సాధనే లక్ష్యంగా సర్పంచుల సంఘాన్ని 1995 సంవత్సరంలో వైవిబి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. సర్పంచులకు అనుకూలమైన జీవోలు కోర్టు తీర్పులు నిధులు సాధించడంలో సంఘం కీలక పాత్ర పోషించిందని ఆయన చెప్పారు. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నికైన సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం పార్టీలకు అతీతంగా ఏకమై పోరాడుదాం అని ఆయన మరోసారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఖమ్మం నరేంద్ర, ప్రధాన కార్యదర్శి బాధేపల్లి సిధార్థ, తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, మాజీ రాష్ట్ర సర్పంచుల సంఘము అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ ల సంఘము రాష్ట్ర అధ్యక్షులు శ్రీశైలం, మాజీ జడ్పీటీసీల సంఘము రాష్ట్ర అధ్యక్షులు బెల్లం శ్రీనన్న, మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘము అధ్యక్షులు మధుసూదన్ గుప్త, ప్రస్తుత రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘము అధ్యక్షులు శివారెడ్డి, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో సమ్మె సైరన్..

**- సమస్యలు పరిష్కరించకుంటే సంస్థ స్తంభింపజేస్తాం**

**- ఎఐటీయూసీ హెచ్చరిక**



కొత్తగూడెం బ్యూరో జూన్ 16(విజన్ ఆంధ్ర) : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొనసాగితే సమ్మె తప్పదని, ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. సోమవారం ఉదయం పీవీకే-5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని బలహీనతగా భావించవద్దని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మిక సంక్షేమం, సంస్థ భవిష్యత్ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కంటే రాజకీయ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి అంశాలపై అనేకసార్లు చర్చలు జరిగినప్పటికీ అమలు దశలో పురోగతి కనిపించడం లేదని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం స్పందించడం లేదని ఆరోపించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఎఐటీయూసీ చేపట్టిన పోరాట ఫలితమేనని పేర్కొంటూ, ఐక్య పోరాటం ద్వారానే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, సంస్థ విస్తరణ, భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాల కల్పనపై చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్ల అమలు కాకపోవడానికి రాజకీయ జోక్యమే కారణమని ఆరోపిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఇతర నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిష్కరిస్తాం

**- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధంగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి వివరించగా, ఆమె ప్రతి ఫిర్యాదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును విచారించి, చట్టపరమైన పరిధిలో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వివిధ విషయాలపైన అందిన ఫిర్యాదు లపైన బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని, ఎల్లప్పుడూ ప్రజల నుండి పోలీస్ అధికారులు ఫిర్యాదులు తీసుకొని, ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎస్పి తెలిపారు.

## నూతనవిద్యాసంవత్సరం ఘనంగా ప్రారంభం.




నారాయణపేట , జూన్ 15 (విజన్ ఆంధ్ర) : నూతన విద్యా సంవత్సరంను మాగనూర్ మండల పరిధిలోని ముడుమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో సోమవారంఘనంగా ప్రారంభించారు. నూతన విద్యా సంవత్సరమును పురస్కరించుకొని పాఠశాలకు హాజరైన విద్యార్థినీ విద్యార్థులపై పుష్పాలు చల్లుతూ గులాబీ పూలను చేతికి అందిస్తూ ఘనంగా విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం స్వాగతం తెలిపారు. విద్యార్థులు కృతజ్ఞతా భావంతో ఉపాధ్యాయ బృందం కు ధన్యవాదాలు తెలుపుతూ పాదాభివందనం చేస్తూ పాఠశాలలోకి ప్రవేశించారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రతి తరగతి గదిని నిశితంగా పరిశీలిస్తూ ఎలాంటి క్రిమి కీటకాలు లేవని నిర్ధారించిన తర్వాత విద్యార్థులను తరగతి గదిలోకి పంపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతినిత్యం క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ప్రతి రోజు ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను నేర్చుకొని ఉన్నత స్థాయికి రావాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం కురుమయ్య, జనార్దన్ రెడ్డి,శ్రీనివాస్, మాధవి, రమేష్ తిమ్మప్ప, హేమా,మీనా కుమారి పాల్గొన్నారు.

## జూన్ 20 తేదీన లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవాలి.





భూపాలపల్లి జిల్లా 15 జూన్ (విజన్ ఆంధ్ర) : జూన్ ఇరవై తారీఖున నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి. కన్నయ్య లాల్ గారు సూచించారు. న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్ తో సోమవారం వేరు వేరుగా సమావేశాన్ని నిర్వహించారు. కేసుల పరిష్కారంలో రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలని వారు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసులోని ఇరువర్గాలవారు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బులు వృధా కావని, మనశాంతిని పొందవచ్చని వారు పేర్కొన్నారు, సివిల్ కేసుల్లో రాజి పడ్డవారికి కోర్టు ఫీజు కట్టినచో, తిరిగి ఇవ్వబడుతుందని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయవాదులు భూక్యా రమేష్ నాయక్, మొయినుద్దీన్, సంధ్య, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల మోత బరువు తగ్గేదెలా..?

- చిన్నారుల భుజాలపై మోయలేని భారం..
- నిబంధనలు ఉన్నా అమలు శూన్యం..
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం




**కొత్తగూడెం బ్యూరో, జూన్ 16(విజన్ ఆంధ్ర) :** వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. కొత్త యూనిఫాంలు, కొత్త పుస్తకాలతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టినప్పటికీ, వారి భుజాలపై మోస్తున్న పుస్తకాల భారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. చదువు కోసం బడికి వెళ్తున్న చిన్నారులు రోజురోజుకూ పెరుగుతున్న స్కూల్ బ్యాగ్‌ల బరువుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. చదువు పిల్లలకు ఆనందాన్ని పంచాల్సిన సమయంలో పుస్తకాల భారం వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు తమ శరీర బరువుకు మించిన బ్యాగ్‌లను మోస్తూ నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాల్లో నడుస్తున్న పాఠశాలల్లో చిన్నారులు బరువైన బ్యాగ్‌లతో మెట్లు ఎక్కి దిగాల్సి రావడం మరింత కష్టంగా మారుతోంది.

### నిబంధనలు కాగితాలకే పరిమితం

విద్యార్థుల బ్యాగ్‌ల బరువును నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో పలు మార్గదర్శకాలు జారీ చేశాయి. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మించకుండా బ్యాగ్ బరువు ఉండాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పుస్తకాల భారం మోయకూడదని కూడా సూచించబడింది. అలాగే 1, 2 తరగతుల విద్యార్థుల బ్యాగ్ బరువు 1.5 కిలోలలోపు, 3 నుంచి 5వ తరగతి వరకు 2 నుంచి 3 కిలోలు, 6, 7 తరగతులకు 4 కిలోలలోపు, 8 నుంచి 10వ తరగతుల వరకు 5 కిలోలలోపు ఉండాలని మార్గదర్శకాలు పేర్కొం టున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో ఈ నిబంధనల అమలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### లెక్కకు మించి పుస్తకాల భారం

ప్రస్తుతం అనేక ప్రైవేట్ పాఠశాలల్లో రెగ్యులర్ పాఠ్యపుస్తకాలతో పాటు క్లాస్‌వర్క్, హోంవర్క్, అసైన్‌మెంట్, ప్రాజెక్ట్, యాక్టివిటీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర పేర్లతో అదనపు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నారు. ఒకే సబ్జెక్టుకు రెండు లేదా మూడు పుస్తకాలు ఇవ్వడం వల్ల బ్యాగ్ బరువు గణనీయంగా పెరుగుతోంది. చాలా సందర్భాల్లో ఆ రోజు అవసరం లేకపోయినా విద్యార్థులు అన్ని పుస్తకాలను స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. దీంతో బ్యాగ్‌ల బరువు సాధారణ పరిమితులను దాటి పిల్లలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తోంది.

### బాల హమాలీలుగా మారుతున్న చిన్నారులు

చిన్న వయస్సులోనే అధిక బరువు మోస్తున్న విద్యార్థులు బాల హమాలీలను తలపిస్తున్నారని పలువురు విద్యావేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. చదువుపై ఆసక్తి పెంపొందించాల్సిన దశలో పిల్లలు ప్రతిరోజూ బ్యాగ్ బరువుతోనే ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది చిన్నారులు స్కూల్ నుంచి ఇంటికి చేరేసరికి అలసటతో నీరసించిపోతున్నారు. చిన్న వయస్సులోనే భుజాలు, మెడ, వెన్నుపూసపై అధిక ఒత్తిడి పడటం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

అధిక బరువున్న బ్యాగ్‌లను మోయడం వల్ల పిల్లల్లో మెడనొప్పి, భుజాల నొప్పి, వెన్నునొప్పి, కండరాల బలహీనత, శరీర భంగిమలో మార్పులు వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పిల్లల ఎదుగుదల దశలో ఎముకలు, కండరాలు పూర్తిగా అభివృద్ధి చెందకముందే అధిక భారం మోపడం వల్ల శారీరక ఎదుగుదలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కొంతమంది విద్యార్థుల్లో చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు కనిపిస్తున్నాయని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

### తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం

పిల్లల చదువులో నాణ్యత అంటే ఎక్కువ పుస్తకాలు అనే అపోహ కూడా సమస్యకు ఒక కారణంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు ఎక్కువ పుస్తకాలు ఇచ్చే పాఠశాలల్లోనే చదువు బాగుంటుందని భావిస్తూ యాజమాన్యాలను ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు. పిల్లల బ్యాగ్ బరువును తల్లిదండ్రులు తరచూ పరిశీలించాలని, అవసరం లేని పుస్తకాలు తీసుకెళ్లకుండా చూడాలని సూచిస్తున్నారు. అలాగే పాఠశాలలతో చర్చించి టైమ్‌టేబుల్ ప్రకారం మాత్రమే పుస్తకాలు తీసుకురావాలని కోరాలని నిపుణులు చెబుతున్నారు.

### లాకర్ వ్యవస్థ అవసరం

పాఠశాలల్లో లాకర్ లేదా డెస్క్ నిల్వ సదుపాయం కల్పిస్తే విద్యార్థులు ప్రతిరోజూ అన్ని పుస్తకాలు మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో అమలవుతున్న ఈ విధానాన్ని మన విద్యా వ్యవస్థలో కూడా సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

### అధికారుల పర్యవేక్షణ పెరగాలి

స్కూల్ బ్యాగ్‌ల బరువుపై ఇప్పటికే ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### చదువు భారం కాకూడదు

పిల్లల చేతిలో పుస్తకం ఉండాలి కానీ భుజాలపై మోయలేని భారం ఉండకూడదు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యం దృష్ట్యా స్కూల్ బ్యాగ్‌ల బరువు తగ్గించడం అత్యవసరంగా మారింది. నిబంధనలు అమలైతేనే పిల్లల బాల్యం భద్రంగా ఉంటుంది. లేకపోతే చదువు పేరుతో వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టినట్టే అవుతుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

## అన్నారం షరీఫ్ చెరువును కొల్లగొడుతున్న మోరం మాఫియా..!

- మట్టిని మింగేస్తున్నా అక్రమార్కులు ..?
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నా అధికారులు
- చర్యలు తీసుకోవాలి అని గ్రామస్తుల డిమాండ్






వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్15(విజన్ ఆంధ్ర) ; వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ చెరువు అక్రమార్కుల కబంధహస్తాల్లో చిక్కుకుపోయిందా? ప్రజల అవసరాల కోసం నిర్మించిన చెరువును కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత సంపదగా భావించి రాత్రి వేళల్లో హిటాచీ యంత్రాలతో మోరంను యథేచ్ఛగా తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పగటిపూట ప్రజల కంట పడకుండా, రాత్రి చీకటి మాటున సాగుతున్న ఈ దందా వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్నది ఇప్పుడు గ్రామంలో హాట్‌టాపిక్‌గా మారింది. చెరువు గర్భాన్ని కోసుకుంటూ హిటాచీలు గర్జిస్తున్నా, ట్రాక్టర్లు వరుసగా మోరం తరలిస్తున్నా సంబంధిత శాఖలు మాత్రం కళ్లు మూసుకుని కూర్చోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, గ్రామ ప్రజల సమస్యలపై పోరాడాల్సిన కొందరు స్థానిక మోట లీడర్లే ఈ అక్రమ తవ్వకాల వ్యవహారంలో భాగస్వాములయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆస్తిని కాపాడాల్సిన వారే అక్రమ దందాలకు అండగా నిలవడం గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న ప్రతి ట్రాక్టర్ లోడ్ వెనుక వేల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని, ప్రజల సహజ వనరులను కొల్లగొట్టి కొందరు తమ జేబులు నింపుకుంటున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. చెరువును అడ్డగోలుగా తవ్వడం వల్ల భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో హిటాచీలు, ట్రాక్టర్లు పనిచేస్తుంటే అధికారులకు కనిపించడం లేదా? అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు ఎందుకు మౌనం వహిస్తున్నాయి? ఈ మోరం మాఫియాకు రాజకీయ అండ ఉందా? ప్రజల చెరువును దోచుకుంటున్న వారిపై చర్యలు ఉండవా అని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చెరువులో జరుగుతున్న అక్రమ మోరం తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 15(విజన్ ఆంధ్ర బ్యూరో) : పోలీసు శాఖతో పాటు సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో నీట్ పరీక్షను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈనెల 21న నిర్వహించు నీట్ పునఃపరీక్ష ఏర్పాట్లపై సోమవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష రాసేందుకు ఈసారి 15 నిమిషాల గడువు పొడిగించినందున మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5: 15 నిమిషాల వరకు పరీక్ష రాసేందుకు అభ్యర్థులకు అవకాశం ఉందన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు మరో గంట అదనంగా పరీక్ష రాసేందుకు సమయం కల్పించడం జరిగిందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ లోని నియమ నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై ఈనెల 20న ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మున్సిపల్, వైద్య, తపాలా, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులందరూ తమ విధులను సజావుగా నిర్వహించి జిల్లాలో నీట్ పరీక్షను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, డీఈవో విజయలక్ష్మి, నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ముధోల్:15జూన్:విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వివిధ అనారోగ్య కారణాలతో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన అయిటోల్ల గంగాధర్ కు రూ.22500, హంగీర్గ సాయినాథ్ రూ .14500, మండలంలోని గన్నోర, చించాల, ముద్గల్ గ్రామాలకు చెందిన అప్పల రవీందర్ కు రూ .30వేలు, గట్టుపల్లి రవి రూ .25వేలు, రాజుల గోదావరి లకు రూ.11500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మె ల్యే పవార్ రామారావు పటేల్ సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద రఖాస్తులు పెండింగ్ లో లేకుం డా చెక్కులను బాధితు లకు అందజేస్తున్నారన్నారు. ప్రభు త్వ పథకాలను అర్హులైన నిరు పేదలకు అందేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తాటివార్ రమేష్, ధర్మపురి సుదర్శన్, సాయినాథ్, తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కమలాపూర్ గుట్ట హనుమాన్ ఆలయానికి నూతన సీసీ రోడ్డు ప్రారంభం



భైంసా, జూన్ 15:విజన్ ఆంధ్ర : భైంసా మండలంలోని కమలాపూర్ గుట్టలో ఉన్న హనుమాన్ ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డును సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఆలయానికి చేరుకునే భక్తులు, స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరమయ్యాయి. రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా దైవ దర్శనానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ రహదారి నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండేగాం సర్పంచ్ పవార్ రాష్ట్రీపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఆలయానికి వెళ్లే భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## బడి బస్సులపై రవాణా శాఖ అధికారుల కొరడా..

- విజన్ ఆంధ్ర కథనానికి స్పందన
- కళాశాల బస్సులపై కేసుల నమోదు





VISION ANDHRA EFFECT VISION ANDHRA

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15,(విజన్ ఆంధ్ర ) : పాఠశాలలు ప్రారంభం కావడంతో మంచిర్యాల రవాణా శాఖ అధికారులు బడి బస్సులపై కొరడా ఝూలిపిస్తున్నారు. సోమవారం పాఠశాలలు ప్రారంభమై రోడ్డెక్కగానే రవాణా శాఖ అధికారులు ఓ కళాశాల బస్సులో , ప్రథమ చికిత్స కిట్టు లేకపోవడం, ఫైర్, విద్యార్థుల రిజిస్టర్ బుక్ లేకపోవడం తో ఆ బస్సుపై కేసు నమోదు చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలకు మొదటి నుంచి తెలియజేస్తున్న పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నెల 10 న విజన్ ఆంధ్ర దినపత్రిక లో బడి బస్సుల భద్రత పై రవాణా శాఖ అధికారుల కొరడా అని ముందే హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమై జిల్లాలో చర్యలు చేపడుతున్నారు..

## అర్హులైన జర్నలిస్ట్ లు అందరికీ 2వవిడత అక్రిడేషన్ కార్డులు ఆమోదించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్..





నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 15 జిల్లాలో మీడియా అక్రిడేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండో విడత అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ రెండో విడత జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందిన 237 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. జర్నలిజం వృత్తి సమాజానికి బాధ్యతాయుతమైన సేవ అని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే విలేకరులకు ప్రభుత్వం కల్పిస్తున్న అక్రిడేషన్ సదుపాయాలు నిజమైన జర్నలిస్టులకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల సేవా వివరాలు, వార్తా ప్రచురణలు, సంస్థల ధృవీకరణ పత్రాలు, పని అనుభవం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లు, సిఫార్సులు లేదా వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పూర్తిగా నిష్పాక్షికంగా కమిటీ సభ్యులు వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రిడేషన్ వ్యవస్థపై జర్నలిస్టుల్లోనూ, ప్రజల్లోనూ విశ్వాసం పెరిగేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని చెప్పారు. జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిఎం హాజరు కాకపోవడంతో కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పలు దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించగా, అర్హతలు, సమర్పించిన పత్రాలు, స్థానిక స్థాయి ధృవీకరణ నివేదికలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని దరఖాస్తులపై అదనపు సమాచారం సేకరించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె కిరణ్ కుమార్, జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రావు, సురేష్ కుమార్, సాయిలు సాగర్, ప్రదీప్ కుమార్, వెంకట్ స్వామి, దస్తగిరి, మొహమ్మద్ ముబీన్ ఖాన్, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## సర్పంచ్, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో కలెక్టర్ కు దళిత మహిళ ఫిర్యాదు
- ఇందిరమ్మ ఇల్లు అర్థాంతరంగా ఆపేశారని ఆవేదన
- సర్పంచ్ పై దళితసంఘాల ఆగ్రహం



పాపన్నపేట, విజన్ ఆంధ్ర,జూన్ 15 : తమకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేశారని, ఇందుకు కారణమైన గ్రామ సర్పంచ్ మరియు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన రేవెళ్ళి సంధ్య సోమవారం కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తనకు నివసించేందుకు సొంత ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, ఇటీవల ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేసిన అనంతరం, అకస్మాత్తుగా మెటీరియల్ సరఫరా నిలిపివేసి పనులను ఆపివేశాడని ఆరోపించారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, గ్రామ సర్పంచ్ శ్రీధర్ ఆదేశాల మేరకే పనులు నిలిపివేశానని చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌ను కలిసి కారణం అడగగా, గత సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కారణంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసినట్లు స్పష్టంగా తెలిపారని ఆరోపించారు. అంతేకాకుండా, తనను ఆ 30 మంది గెలిపించారని, వారు అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగుతుందని, పదేపదే తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయని, ఆ దశకు సంబంధించిన ఒక బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. కావున, తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌తో పాటు, నిలిపివేతకు కారణమైన గ్రామ సర్పంచ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, తన ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రేవెళ్ళి సంధ్య ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, బద్రి మల్లేశం, మన్నె వెంకటేశం తదితరులు ఉన్నారు.

దళిత సంఘాల ఆగ్రహం:

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మరియు గ్రామ సర్పంచ్ అర్థాంతరంగా నిలిపివేయడం పట్ల మెదక్ జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబం పట్ల సర్పంచ్ తీరు సరికాదని, ఇలాంటివి పునరావృతమైతే ఆందోళనలు సైతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,జూన్ 15,(విజన్ ఆంధ్ర); ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.